Follow: @ANNTELUGU

30-01-2025

ANN తెలుగు

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 59 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




టాప్ న్యూస్

## హర్యానాలో బీజేపీ ప్రభుత్వం ఉంది

- నేను యమునా నీరు తాగుతా
- అందులో విషం కలుపుతారా
- ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



02

## అధికారంలో ఉన్నప్పుడు మరుపులు అధికారం పోగానే అరుపులు

- ఓట్ల కోసం ఎత్తులు వేయడం బీఆర్ఎస్ నైజం
- పథకాలు ప్రకటించడం, ఆతర్వాత విస్మరించడం ఆ పార్టీకి అలవాటు
- నల్గొండలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీతక్క సీరియస్



02

## అయితే జూబ్లిహిల్స్.. లేకుంటే సీసీసీ

- మంత్రులు, అధికారులను పరుగులు పెట్టిస్తున్నావు
- సీఎం రేవంత్ పై బీఆర్ఎస్ నేత హరీష్ విమర్శలు



05



## హామీలు తప్ప అమలు ఏది

- ప్రజా పోరాటాలతో కాంగ్రెస్‌ను వెంటాడుతాం
- పద్మా అవార్డుకు గద్దర్ అర్హుడే
- పీడిత, తాడిత ప్రజలతోనే పార్టీని పునర్ నిర్మిస్తాం
- బీజేపీని రాష్ట్రంలో ఎదగనివ్వం
- బీజేపీ పట్ల బీఆర్ఎస్ వైఖరి స్పష్టం చేయాలి
- రాష్ట్రంలో మూడు పార్టీలు ఒక్కటే
- మహా - ఎఎన్ఎన్‌తో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రత్యేక ఇంటర్వ్యూ

**హైదరాబాద్, మహా :** రేవంత్ సర్కార్ పైన యుద్ధం చేస్తామని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసేంత వరకూ పోరాటం చేస్తామని సీపీఎం తెలంగాణ రాష్ట్ర నూతన కార్యదర్శి జాన్ వెస్లీ సంచలన వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో



# కుంభమేళా చరిత్రలో మహా విషాదం

### అర్ధరాత్రి తొక్కిసలాట 30 మంది మృతి.. మరో 60 మందికి గాయాలు

- మృతుల్లో 25 మంది గుర్తింపు.. బారికేడ్లు విరగడంతో ప్రమాదం
- ఘటనపై జ్యుడిషియల్ విచారణకు ఆదేశం
- పరిస్థితిని ఎప్పికప్పుడు సమీక్షిస్తున్న సీఎం యోగీ ఆదిత్యానాథ్

“ మౌని అమావాస్య సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభ్‌నగర్ త్రివేణి సంగమం వద్ద మహా కుంభమేళాలో బుధవారం తెల్లవారు జామున తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో 30 మంది మరణించారు. మరో 60 మంది గాయపడ్డారు. క్షతగాత్రులందరినీ వేర్వేరు ఆస్పత్రులలో చేర్పించి అధికారులు చికిత్స అందిస్తున్నారు. తొక్కిసలాట ఘటనపై ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం అధికారిక ప్రకటన చేసింది. ఈ దుర్ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. మరో 60 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. చనిపోయిన వారిలో 25 మందిని మాత్రమే ఇప్పటి వరకు గుర్తించినట్లు పేర్కొన్నారు. - ప్రయాగ్‌రాజ్, మహా

03


# మోగిన ఎన్నికల నగారా

### ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాలకు పోలింగ్
- రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో అమల్లోకి వచ్చిన కోడ్

**ఢిల్లీ, మహా :** శాసన మండలి ద్వైవార్షిక ఎన్నికల నగారా మోగింది. రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గంతో పాటు ఉపాధ్యాయ నియోజకవర్గానికి కూడా ఎన్నిక జరగనుంది. వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ మూడు స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న జీవన్ రెడ్డి, రఘోత్తంరెడ్డి, నర్సిరెడ్డి పదవీ కాలం మార్చ్ 29వ తేదీతో ముగియనుంది. ఈ మూడు స్థానాలకు కొత్త వారిని ఎన్నుకునేందుకు వీలుగా ఫిబ్రవరి మూడో తేదీన నోటిఫికేషన్ విడుదల కానుంది. పదో తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉంటుంది. ఫిబ్రవరి 11వ తేదీన నామినేషన్ల పరిశీలన చేపడతారు. నామినేషన్ల ఉపసంహరణకు 13వ తేదీ వరకు గడువు ఉంటుంది. ఫిబ్రవరి 27వ తేదీన ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మార్చ్ మూడో తేదీన ఓట్ల లెక్కింపు చేపడతారు. ఎన్నిక ప్రక్రియను మార్చి 8వ తేదీ వరకు పూర్తి చేయాలని ఈసీ స్పష్టం చేసింది. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఆయా జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమల్లోకి వచ్చినట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. రాష్ట్రంలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్ నగర్ మినహా మిగిలిన ఏడు జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది.



## ఝాన్సీ వర్సెస్ జానీ

### వార్ మళ్ళీ మొదలు

**మహా, ఫిల్మ్ డెస్క్:** జానీ మాస్టర్‌పై ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ పెట్టిన ఒక కేసును నెగ్గినట్లుగా టాలీవుడ్ లైంగిక వేధింపుల కమిటీలోని సభ్యురాలైన నటి ఝాన్సీ సోషల్ మీడియా వేదికగా ఓ రిపోర్ట్‌ని పోస్ట్ చేసింది. ఆ రిపోర్ట్‌పై జానీ మాస్టర్ కూడా వెంటనే రియాక్ట్ అవుతూ..

మిగతా 2లో


ఇంటింటి సమగ్ర

# సర్వే సక్సెస్


### రెండు రోజుల్లో ముసాయిదా నివేదిక

- ఫిబ్రవరి 2న కేబినేట్ సబ్ కమిటీకి తుది నివేదిక
- దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ
- అధికారులు, ఉద్యోగులను అభినందించిన ముఖ్యమంత్రి

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో విజయవంతంగా పూర్తయిన సమగ్ర కుల గణనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఇటీవల చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే దేశ వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిందని ముఖ్యమంత్రి అన్నారు. జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేపై ప్రశంసలు అందుతున్నాయని చెప్పారు. ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్కమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు, మాజీ మంత్రి జానారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మిగతా 2లో




## ఏనుమాముల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రియాంక

### వైస్ చైర్మన్‌గా బండి జనార్దన్

18 మందితో పూర్తి స్థాయి కమిటీ

**వరంగల్, మహా:** ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఆసియాలోనే అతి పెద్దదైన వరంగల్లు మాముల మార్కెట్ కమిటీని ప్రభుత్వం ప్రకటించింది. చైర్ పర్సన్‌గా ఎర్ర ప్రియాంక, వైస్ చైర్మన్ గా



మిగతా 5లో



## కేటీఆర్, హరీష్ రావులు నా కాలి గోటికి సరిపోరు

- మంత్రి కోమటిరెడ్డి ఘాటు వ్యాఖ్యలు.. గద్దర్ కు అవార్డు ఇస్తే తప్పేంటి
- తెలంగాణ ఉద్యమంలో గద్దర్ ఉన్నారా, సంజయ్ ఉన్నారా అని ప్రశ్న

వివరాలు 2లో



## నాగోబా జాతర ఉత్సవాలు మొదలు

### భారీగా జాతరకు తరలివచ్చిన జనం

వివరాలు 5లో

# ఇంటింటి సమగ్ర సర్వే సక్సెస్



(మొదటిపేజీ తరువాయి)


సమగ్ర కుటుంబ సర్వే విజయవంతంగా నిర్వహించిన అధికారులు, ఉద్యోగులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కుల గణన ప్రక్రియ సామాజిక సాధికారతతో పాటు, భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బలహీన వర్గాలందరి అభ్యున్నతికి ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ కుల గణన సర్వేను చేపట్టి తమ చిత్తశుద్ధిని చాటుకుందని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ డెడికేటేడ్ కమిషన్ కు ఈ గణాంకాలు ఉపయోగ పడుతాయని అన్నారు.

సర్వే డేటా ఎంట్రీ పూర్తయిందని, ఒకటి రెండు రోజుల్లో ముసాయిదా నివేదికను సమర్పిస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఫిబ్రవరి 2వ తేదీ లోగా కేబినెట్ సబ్ కమిటీకి తుది నివేదికను అందజేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నవంబర్ 6వ తేదీన రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే 2024) మొదలైంది. అన్ని జిల్లాల్లో డిసెంబర్ మొదటి వారంలో సర్వే పూర్తయింది. ప్రణాళిక విభాగం అధ్వర్యంలో చేపట్టిన ఈ ఇంటింటి సర్వే మహా యజ్ఞంలో ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు దాదాపు లక్ష మందికిపైగా ఉద్యోగులు పాలు పంచుకున్నారు. రాష్ట్రంలోని దాదాపు 1.16 కోట్ల కుటుంబాలను సర్వేకు గుర్తించింది. ఎన్యుమరేటర్లను ఇంటింటికీ పంపించి వివరాలను సేకరించింది. దాదాపు 96 శాతానికి పైగా కుటుంబాల వివరాలను సర్వే బృందాలు విజయవంతంగా సేకరించాయి. వీటికి సంబంధించిన డేటా ఎంట్రీని పూర్తి చేశాయి. కొన్ని చోట్ల కుటుంబాలు సర్వేకు నిరాకరించటం, కొన్ని ఇండ్లకు తాళాలు ఉండటం, కొన్ని కుటుంబాలు అందుబాటులో లేకపోవటం తదితర కారణాలతో కొన్ని కుటుంబాలు సర్వేలో పాలుపంచుకోలేదని అధికారులు ఈ సందర్భంగా వివరించారు.

**రికార్డు వేగంతో కుల గణన**

అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే ఫిబ్రవరి 4వ తేదీన సీఎం నేతృత్వంలో భేటీ అయిన రాష్ట్ర మంత్రి వర్గం ఇంటింటి సర్వే ద్వారా కుల గణన చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి 16వ తేదీన ఈ సర్వే చేపట్టేందుకు అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం చేసింది. సెప్టెంబర్ 12వ తేదీన ఇంటింటి సర్వే కుల గణన చేపట్టేందుకు అవసరమైన విధి విధానాలను ఖరారు చేసేందుకు ప్రభుత్వం కేబినేట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారధ్యంలో ఆరుగురు మంత్రులతో ఏర్పాటయిన సబ్ కమిటీ వివిధ దఫాలుగా సమావేశమైంది. అక్టోబర్ 9వ తేదీన మంత్రి వర్గ ఉపసంఘం ఇచ్చిన సిఫారసులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించారు. సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల గణన పేరిట సర్వే చేపట్టాలని, ప్రణాళిక విభాగాన్ని నోడల్ ఏజెన్సీగా నియమించారు. అక్టోబర్ 10వ తేదీన ప్రణాళిక విభాగం సర్వేకు సంబంధించిన పూర్తి విధి విధానాలతో జీవో నెం.18 జారీ చేసింది.

# హామీలు తప్ప అమలు ఏది



- ప్రజా పోరాటాలతో కాంగ్రెస్‌ను వెంటాడుతాం
- పద్మా అవార్డుకు గద్దర్ అర్హుడే
- పీడిత, తాడిత ప్రజలతోనే పార్టీని పునర్ నిర్మిస్తాం
- బీజేపీని రాష్ట్రంలో ఎదగనివ్వం
- బీజేపీ పట్ల బీఆర్ఎస్ వైఖరి స్పష్టం చేయాలి
- రాష్ట్రంలో మూడు పార్టీలు ఒక్కటే
- మహా - ఎఎన్ఎన్‌తో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రత్యేక ఇంటర్వ్యూ

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన నేపథ్యంలో ఎఎన్ఎన్ తెలుగు ఛానల్, మహా పత్రికకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో జాన్ వెస్లీ పలు అంశాలపై స్పందించారు. ఎమ్మార్పీఎస్ చేస్తున్న వర్గీకరణ ఉద్యమానికి సీపీఎం మద్దతు ఉంటుందని గతంలోనే ప్రకటించామని గుర్తు చేస్తూ బీజేపీ పక్కన ఉంటే మంద కృష్ణ మాదిగను వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. బీజేపీ మత విద్వేషాల రాజకీయం చేస్తోందన్నారు. రాష్ట్రంలో బీజేపీని ఎదగకుండా అడ్డుకునేందుకు అందివచ్చే అన్ని అవకాశాలను వినియోగించుకుంటామన్నారు. లగచర్లలో ఇంటింటికి తిరిగి రైతుల పోరాటానికి మద్దతు ఇచ్చామన్నారు. తమ పోరాటానికి ఫలితంగానే ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కు తీసుకుందన్నారు. కేసీఆర్ ప్రజల్లోకి వచ్చి పోరాటం చేయాలన్నారు. బీజేపీ వ్యతిరేక పోరాటంలో బీఆర్ఎస్ పాల్గొనాలన్నారు.

రాష్ట్రంలో కార్మిక వర్గం, రైతులు, కూలీలు, పెట్టుబడిదారులు, భూస్వాములు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ విధానాలకు దోపిడీకి గురవుతున్నారన్నారు. ఆ వర్గ ప్రజలకు న్యాయం జరగడం కోసం సీపీఎం పార్టీ భవిష్యత్తులో మరింత ఉధృతమైన పోరాటాలు చేస్తుందని తెలిపారు. సామాజికంగా అణిచివేతకు గురవుతున్న దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలు, మైనార్టీలు, మహిళల మీద తీవ్రమైన అణిచివేత, అత్యాచారాలు, కుల వివక్ష ఇలాంటి దారుణమైన ఘటనలు జరుగుతున్నాయని, దోపిడీకి గురవుతున్న ప్రజలను సంఘటితం చేస్తూ, సామాజిక అణిచివేతకు గురవుతున్న సామాజిక తరగతులను కూడా కలుపుకుని తెలంగాణ రాష్ట్రంలో ఒక బలమైన ఉద్యమాన్ని నిర్మించాలని చూస్తున్నాం. కాంగ్రెస్ సర్కార్ అనేక వాగ్దానాలు ఇచ్చింది, అమలు మాత్రం శూన్యమన్నారు. ఒక్క మహిళలకు ఉచిత బస్సు తప్ప మిగతా ఏ హామీ కూడా సక్రమంగా అమలవడం లేదన్నారు. పెన్షన్ల పెంపు, రైతు రుణ మాఫీ, రైతులకు సహాయం చేయడం, నిరుద్యోగ భృతి, యువతకు ఉపాధి కల్పించడం తదితర హామీలపై ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ వద్ద ప్లాన్ లేదన్నారు. గత బీఆర్ఎస్ పార్టీ ప్రజా సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం చేస్తుందని, తాము అధికారంలోకి వస్తే వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్ నాన్చివేత, అణచివేత, సాచివేత దోరణితో పాలన సాగిస్తుందని మండిపడ్డారు. రైతులకు సంబంధించి రైతు రుణమాఫీ, గిట్టుబాటు ధరలు కల్పించే విషయంలో సరైన విధానం లేదన్నారు. ఉపాధి కూలీలకు పని కల్పించడంలో కూడా ప్రభుత్వం విఫలం అవుతోందన్నారు. ఉద్యోగాల భర్తీ సరిగా జరగడం లేదని అభిప్రాయపడ్డారు. చెప్పినంత వేగంగా కార్యాచరణ జరగడం లేదని, కాంగ్రెస్ పార్టీపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వారందరికీ నిరాశే ఎదురవుతుందన్నారు.
విద్యా, వైద్యం తెలంగాణలో వ్యాపారంగా మారిందని, వాటిని అరికట్టే చర్యలను ఈ ప్రభుత్వం తీసుకోవడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది పేదలు, కార్మికులు కనీస వేతనం లేకుండా ఉన్నారని, ఇల్లు, ఇంటి స్థలం లేక గుడిసెల్లోనే ఉంటున్నారన్నారు. వారికి కనీసం ఇప్పటివరకు పట్టాలు ఇవ్వడం కానీ, ఇళ్లు కట్టించి ఇవ్వడం కానీ ప్రభుత్వం చేయలేదని పేర్కొన్నారు. కనీసం ఉండేందుకు జాగా కూడా లేని స్థితిలో పేదలు ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై పోరాటం కొనసాగిస్తామన్నారు. సంక్షేమ హాస్టల్స్ లో కనీస సౌకర్యాలు మెరుగుపడటం లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెరగడం లేదని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పించేలా పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

గద్దర్ పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను జాన్ వెస్లీ తీవ్రంగా తప్పుపట్టారు. పీడిత, తాడిత ప్రజల అభ్యున్నతి కోసం గద్దర్ అన్నీ తానై పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం సాగిన ఉద్యమంలో గద్దర్ తన ఆట పాటలతో ప్రజల్లో చైతన్యం కలిగించారన్నారు. గద్దర్ పాచలతోనే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉగ్రూతలూగిందన్నారు. ఆయనకు పద్మ అవార్డు ఇవ్వమని కేంద్రం చెప్పడం అత్యంత దారుణమన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఏకపక్ష పాలన సాగిస్తుందనేందుకు ఇంతకన్నా వేరే నిదర్శనం అవసరం లేదన్నారు. అర్హులకు కాకుండా తన తాబేదార్లకు అవార్డులను ఇవ్వాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అన్ని వర్గాల ప్రజలు తప్పుపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

భవిష్యత్ కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించామని, ఉద్యమాలతోనే పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. మేమెప్పుడూ ఓట్లు, సీట్ల కోసం పాకులాడలేదని, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడ్డామని గుర్తు చేశారు. దావోస్ పర్యటనలో కేసీఆర్ ఎట్లా ఆర్భాటం చేశారో రేవంత్ రెడ్డి అట్లాగే వ్యవహరించారని జాన్ వెస్లీ అభిప్రాయపడ్డారు. అసంఘటిత కార్మికులకు రూ. 25 వేల కనీస వేతనాన్ని ప్రభుత్వం అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. శ్రామిక వర్గాన్ని దోపిడీ చేసే విధానాలను ప్రభుత్వం అనుసరిస్తోందని, దీన్ని విడనాడాల్సిన అవసరం ఉందన్నారు. శ్రామిక వర్గాల కోసం పోరాటం చేసేది సీపీఎం మాత్రమేనని పేర్కొన్న ప్రధాన కార్యదర్శి ప్రజా ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని తెలిపారు. సీపీఎం పోరాటం చేసి సాధించిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను అమలు చేయడం లేదని గుర్తు చేశారు. బీజేపీ ప్రమాదాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్తామని, రాష్ట్రంలో బీజేపీని ఎదగనివ్వమని శపథం చేశారు. బీజేపీ పట్ల బీఆర్ఎస్ స్పష్టమైన వైఖరి ప్రకటించడం లేదని గుర్తు చేశారు. బీజేపీ గురించి కేసీఆర్ ఇప్పటి వరకు ఎలాంటి వ్యాఖ్యలు చేయడం లేదన్నారు. సీపీఎం స్వంతంగా బలోపేతం కావడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామన్నారు. భవిష్యత్ లో రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతపోరాటాలు ఉంటా.న్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ఈ మూడు పార్టీల విధానాలు ఒక్కటేనని అన్నారు. వామపక్షాలను కలుపుకుని ప్రత్యామ్నాయ రాజకీయాలను సీపీఎం చేస్తోందన్నారు. సీపీఎం చేసే పోరాటాలకు ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో వర్గ పోరాటం మూడు రూపాల్లో ఉందని, మతోన్మాదం, కుల వివక్ష, ఆర్థిక విధానాలపై సీపీఎం పోరాటం ఉంటుందన్నారు.

# కేటీఆర్, హరీష్ రావులు నా కాలి గోటికి సరిపోరు

**మంత్రి కోమటిరెడ్డి ఘాటు వ్యాఖ్యలు.. గద్దర్ కు అవార్డు ఇస్తే తప్పేంటి**

**తెలంగాణ ఉద్యమంలో గద్దర్ ఉన్నారా, సంజయ్ ఉన్నారా అని ప్రశ్న**



**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్‌రావులపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బుధవారం గాంధీ భవన్ లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ, కేటీఆర్, హరీష్ రావులు తన కాలి గోటికి కూడా సరిపోరన్నారు. కేటీఆర్ పనికిరాని వ్యక్తి అని, పనికి రాని మాటలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ ఉన్నరా, బండి సంజయ్ ఉన్నరా అని ప్రశ్నించారు. గద్దర్‌కు అవార్డ్ ఇస్తే తప్పేంటని నిలదీశారు. అణగారిన ప్రజల కోసం గజ్జె కట్టి పాట పాడి. గద్దర్ ఉద్యమం చేసిండన్నారు. కాంగ్రెస్ మీటింగ్‌లో పల్లీలు, ఐస్ క్రీంలు అమ్ముకునేంత మంది కూడా కేటీఆర్ మీటింగ్‌కు రాలేదని ఎద్దేవా చేశారు. నల్లగొండలో టీ హాబ్‌కు తాళం వేసిందే కేటీఆర్ అని అన్నారు. నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ పెంచి పోషించే కేటీఆర్ అని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనకు ఎందుకు అడ్డుపడుతున్నారో బీఆర్ఎస్ చెప్పాలన్నారు, కేటీఆర్‌పై ఉన్న అవినీతి ఆరోపణలు తనపై లేవన్నారు. కేసీఆర్ లా తాను ఎలక్షన్, కలెక్షన్ చేయలేదన్నారు. ప్రతిపక్ష నేత పదవి కోసం హరీష్ రావు, కేటీఆర్ కత్తులతో పొడుచుకుంటున్నారన్నారు. ప్రతిపక్ష నేతగా భట్టి పాదయాత్ర చేసి, ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని, కేసీఆర్ బడ్జెట్ సెషన్‌కు వస్తారో, రారో చెప్పాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. పనికి రాని మాటలు మాట్లాడుతూ, ప్రజల్లో పోయిన పరపతిని తిరిగి సంపాదించుకునేందుకు బావా బామ్మర్దులు పోటీ పడుతున్నారని దుయ్యబట్టారు. అంచలంచలుగా ఎదిగి మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ అయ్యాడని, మామ చాటు అల్లుడు హరీష్ తండ్రి చాటు కొడుకు కేటీఆర్ అని వ్యాఖ్యానించారు. మాది ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఏ సమస్య వచ్చినా తమతో చెప్పుకోవచ్చని ఇందుకోసం గాంధీ భవన్ కు రావచ్చు, ప్రజా భవన్ కు వెళ్ళొచ్చన్నారు.

**ముఖాముఖీ కార్యక్రమం**

గాంధీ భవన్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన కార్యక్రమంలో వందల సంఖ్యలో బాధితులు వచ్చి తమ సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలంటూ అభ్యర్థనలు అందించారు. చాలా రోజుల గ్యాప్ తర్వాత ముఖాముఖీ కార్యక్రమం జరగడంతో ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా తరలి చ్చారు. వచ్చిన అర్జీలలో ఎక్కువ శాతం రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లవే ఉండటం గమనార్హం.

# ఝూన్సీ వర్సెస్ జానీ

**వార్ మళ్ళీ మొదలు**



(మొదటిపేజీ తరువాయి)

కోర్టు ఆర్డర్లపై కూడా తప్పుడు ప్రచారాలు చేసే వారిని జాలేస్తుంది అంటూ.. ఆయన కూడా సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేశారు. ఈ ఇద్దరి స్టేట్‌మెంట్స్‌తో అసలు విషయం ఏమిటనేది కన్ఫ్యూజన్‌గా మారింది. ముందుగా ఝూన్సీ పోస్ట్ గమనిస్తే.. ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వేసిన కేసుపై సవాల్ చేస్తూ జిల్లా కోర్టులో జానీ మాస్టర్ వేసిన మధ్యంతర పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. పని చేసే ప్రదేశాలలో మహిళల భద్రతకు ప్రాధాన్యం ఉంటుందని, పోష్ మార్గదర్శకాలను అమలు చేసే సంస్థలకు ఎప్పుడూ మద్దతు ఉంటుందనేది మరోసారి రుజువైంది. నిజంగా ఇది చాలా ముఖ్యమైన తీర్పు. ఈ విషయంలో ఫెడరేషన్ కఠినంగా ఉండి, ధర్మం వైపు నిలబడినందుకు తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలికి ధన్యవాదాలు.. అని ఝూన్సీ తన పోస్ట్‌లో పేర్కొంది. ఝూన్సీ చేసిన పోస్ట్‌కు కౌంటర్ అనేలా జానీ మాస్టర్.. ''తమ సొంత లాభం కోసం కోర్టు ఆర్డర్లపై కూడా తప్పుడు ప్రచారాలు చేసేవారిని చూస్తుంటే జాలేస్తుంది. ముందస్తుగా నాకు తెలియకుండా జరిగిన యూనియన్ ప్రెసిడెంట్ ఎలక్షన్స్ గురించి నేను పెట్టిన కేసుకి సంబంధించి వచ్చిన తీర్పుని మీకు అనుకూలంగా, నచ్చినట్టుగా మార్చి మరో కేసుతో ముడిపెట్టి పోస్టులు పెడుతూ ఉన్నారు. మీరేది చెప్పినా ప్రజలు నమ్ముతారనుకుంటున్నారేమో కానీ అసలు తీర్పు వివరాలు బయటకి వచ్చిన రోజున మీ నిజస్వరూపమేంటో, దేనికోసం ఈ దుష్ప్రచారం చేస్తున్నారనేది అందరికీ అర్థమవుతుంది. ఆ రోజు ఎంతో దూరం లేదు. న్యాయమే గెలుస్తుంది, నిజం అందరికీ తెలుస్తుంది'' అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. దీంతో అసలు ఏం జరుగుతుందనేది అర్థం కాకుండా పోయింది.

# టీటీడీ తరహాలో యాదగిరి గుట్ట దేవస్థానం బోర్డు

**పవిత్రత కాపాడేలా చర్యలు**

- **భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విధివిధానాలు**
- **అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం**



**హైదరాబాద్,మహా :** తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) తరహాలోనే యాదగిరి గుట్ట దేవస్థానం బోర్డు ఏర్పాటు కు వేగంగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ధర్మకర్తల మండలి ఏర్పాటుకు రూపొందించిన ముసాయిదాలో పలు మార్పులను సీఎం సూచించారు. యాదగిరిగుట్ట బోర్డు నియామకపు నిబంధనలపై ముఖ్యమంత్రి తన నివాసంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. తిరుమలలో మాదిరే యాదగిరిగుట్ట ఆలయం సమీపంలో రాజకీయాలకు తావులేకుండా చూడాలని, ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. ధర్మకర్తల మండలి నియామకంతో పాటు ఆలయం తరపున చేపట్టాల్సిన పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలపై ముసాయిదాలో పేర్కొన్న నిబంధనలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు మార్పులు సూచించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాస రాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

# హర్యానాలో బీజేపీ ప్రభుత్వం ఉంది

**నేను యమునా నది నీరు తాగుతా..**

**అందులో విషం కలుపుతారా**

**ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ**



**ఢిల్లీ, మహా :** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఢిల్లీ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. అధికార, విపక్ష నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. అయితే ఇటీవల అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ, యమునా నదిని హర్యానా ఉద్దేశపూర్వకంగా విషపూరితం చేస్తోందని ఆరోపించారు. దీంతో ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ క్రమంలోనే ఢిల్లీలో బీజేపీ నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ మాట్లాడుతూ కేజ్రీవాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ''ప్రధానమంత్రి తాగే నీళ్లలో హర్యాణాలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విషం కలుపుతుందా ?. ఢిల్లీ మాజీ సీఎం హర్యానా ప్రజలపై అసహ్యకరమైన ఆరోణలు చేశారు. ఓడిపోతామనే భయంతో ఆప్ నేతలు ఆందోళన పడుతున్నారు. హర్యానా, ఢిల్లీలో నివసించే ప్రజలు ఒకరు కాదా? హర్యానాలో ఉండేవారికి బంధువులు ఢిల్లీలో లేరా ?. తమ సొంత ప్రజలు తాగే నీటిని ఉద్దేశపూర్వకంగా విషపూరితం చేస్తారా ?. హర్యానా నుంచి వస్తున్న నీటిని ఢిల్లీలో ప్రతిఒక్కరూ వాడుతున్నారు. ఇందులో నేను కూడా ఉన్నాను అని మోడీ అన్నారు. ఢిల్లీని ఆమ్ ఆద్మీ, కాంగ్రెస్ పార్టీలు 25 ఏళ్లు పాలించాయి. కానీ ఇప్పటికీ ప్రజల సమస్యలు అలాగే ఉండిపోయాయి. విపరీతమైన ట్రాఫిక్ జామ్స్ కావడం, నీళ్లు నిలిచిపోవడం, కాలుష్యం ఇలా అన్ని సమస్యలు కూడా అలాగే ఉన్నాయి. మీరు వేసే ఓటు వీటి నుంచి విముక్తి కలిగించగలదు. 11 ఏళ్ల పాటుగా పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. 25 ఏళ్ల ఫ్యూచర్ ప్లాన్ వేయాలి. 25 ఏళ్ల పాటు ఈ రెండు పార్టీల పాలనను చూశారు. ఇప్పుడు బీజేపీకి ఒక అవకాశం ఇవ్వండి అని' ప్రధాని మోదీ ఓటర్లను కోరారు.

# అధికారంలో ఉన్నప్పుడు మరుపులు.. అధికారం పోగానే అరుపులు

**ఓట్ల కోసం ఎత్తులు వేయడం బీఆర్ఎస్ నైజం**

- **పథకాలు ప్రకటించడం, ఆ తర్వాత విస్మరించడం ఆ పార్టీకి అలవాటు**
- **నల్గొండలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీతక్క సీరియస్**



**హైదరాబాద్, మహా :** 2018 అసెంబ్లీ ఎన్నికల ముందు రైతు బంధు, హుజూరాబాద్ ఉప ఎన్నికల కోసం దళిత బంధు, జీహెచ్ఎంసీ ఎన్నికల ముందు ఇంటికి పది వేలు, 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు బీసీ బంధు, మైనారిటి బంధు పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకునే చరిత్ర బీఆర్ఎస్ దని మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆత్మగౌరవ ఇండ్ల నిర్మాణ వ్యయాన్ని రూ. 5 నుంచి రూ.3 లక్షలకు తగ్గించి, ఇంట్లో కూర్చోని లబ్దిదారుల జాబితాను రెడి చేస్తే, ప్రజలు మిమ్మల్ని ఇంట్లో కూర్చోబెట్టారని గుర్తు చేసారు. ప్రజల సమక్షంలో పథకాల అర్హులను ఎంపిక చేస్తుంటే తట్టుకోలేక అమాయకులను ఆత్మహత్యలు చేసుకునేలా ప్రోత్సహించి రాజకీయాలు చేస్తోంది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు మరుపులు, అధికారం పోగానే అరుపులు అన్నట్లుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు.

2023 జూన్, జూలై మాసాల్లో వేయాల్సిన రైతు బంధు నిధులను నవంబర్ లో ఎన్నికల రోజు వేసేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తే ఎన్నికల కమిషన్ అడ్డు చెప్పిందని మంత్రి సీతక్క గుర్తు చేసారు. ఎక్కడ ఎన్నికలు జరిగితే అక్కడ హమీల వర్షం కురిపించింది వాస్తవం కాదా అని సీతక్క ప్రశ్నించారు. దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడుతో సహా ఎక్కడ ఉప ఎన్నికలు జరిగితే అక్కడే రైతు బంధు నిధులు విడుదల చేసిన ఘనత బీఆర్ ఎస్ కే దక్కుతుందని ఎద్దేవ చేసారు. నాట్ల ముందు కాకుండా ఓట్ల ముందు నిధులు విడుదల చేసినందుకే ప్రజలు బుద్ధి చెప్పారని మండిపడ్డారు. ప్రజలను ఓట్ల యంత్రాలుగా చూసినందుకే గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించారని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అధికారం దూరం కావడాన్ని జీర్ణించుకోలేక కేటీఆర్ నోరు పారేసుకుంటున్నారని సీతక్క మండిపడ్డారు. ఉచిత ఎరువులు, పంట బోనస్ హామీలను విస్మరించిదెవరని కేటీఆర్ ను మంత్రి సీతక్క ప్రశ్నించారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఓడించినా ఆత్మపరిశీలన చేసుకోకుండా... ఆత్మస్తుతి, పరనిందకు పరిమితం అయితే లాభం లేదని హితవు పలికారు.

# కుంభమేళా చరిత్రలో చేదు ఘటనలు

## గత కుంభమేళాలో 42 మంది మృతి

### ఇపుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. తొక్కిసలాట

**మహా, స్పెషల్ డెస్క్:** మహా కుంభమేళాలో తొక్కిసలాట జరిగింది. మౌని అమావాస్య సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించేందుకు సంగమం వద్దకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో భక్తుల తాకిడికి బారికేడ్లు విరగడం వల్ల తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 20 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది. మరో 100 మందికి పైగా గాయపడినట్లు సమాచారం. వెంటనే స్పందించిన సిబ్బంది వారిని అంబులెన్సుల్లో సమీప ఆస్పత్రులకు తరలించారు. తొక్కిసలాట ఘటన నేపథ్యంలో అమృతస్నానం కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నట్లు అఖాడాలు ప్రకటించారు. కుంభమేళా ప్రధానంగా నాలుగు చోట్ల జరుగుతుంది. హరిద్వార్, ప్రయాగ్ రాజ్, ఉజ్జయిన్, నాసిక్ లో జరిగే ఈ కుంభమేళాకు ఏటా కోట్లాది మంది భక్తులు తరలివస్తారు. పుణ్యస్నానాలు ఆచరించి వెనుదిరుగుతారు. ప్రయాగ్ రాజ్ లో వచ్చే కుంభమేళాకు మౌని అమావాస్య కలిసి వస్తుండటం.. ఆ రోజు అమృత స్నానం చేస్తే పాపాలన్నీ నశిస్తాయని నమ్మకం ఉండటంతో ప్రయాగ్ రాజ్ కు భారీగా తరలివెళ్తుంటారు. ఓ సారి చరిత్రను పరిశీలిస్తే ఇప్పటి వరకు ఐదు కుంభమేళాల్లో తొక్కిసలాట జరగగా.. నాలుగు ప్రయాగ్ రాజ్ లోనే జరగడం దారుణం. ప్రమాద సంకేతాలు ఉన్నా.. తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో అలసత్వం కనబడుతోంది.

#### 1954లో 800 మంది మృతి

1954లో తొలి కుంభమేళా జరిగింది. ఫిబ్రవరి 3వ తేదీన తొక్కిసలాటలో 800 మంది ప్రాణాలు కోల్పోగా రెండు వేల మంది గాయపడ్డారు. అది కూడా మౌని అమావాస్య నాడే చోటుచేసుకొంది.

#### 1986లో 200 మంది మృతి

1986 ఏప్రిల్ 14న కుంభమేళా సందర్భంగా నాటి యూపీ సీఎం వీర్‌బహదూర్ సింగ్ తనతోపాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పార్లమెంట్ సభ్యులను తీసుకొని హరిద్వార్‌లో స్నానాలకు వచ్చారు. ఈ సందర్భంగా రద్దీని నియంత్రించలేకపోయారు. దీంతో తొక్కిసలాట చోటుచేసుకొని 200 మంది మరణించారు.

#### 2003 నాసిక్‌లో 39 మంది మృతి

2003లో కుంభమేళా సందర్భంగా మహారాష్ట్రలోని నాసిక్‌లో గోదావరి నదిలో స్నానాలు చేయడానికి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. నాడు జరిగిన తొక్కి సలాటలో 39 మంది మరణించారు.

#### 2013లో సంగమం వద్ద 42 మంది మృతి

2013లో అలహాబాద్‌లో జరిగిన కుంభమేళాలో ఫిబ్రవరి 10వ తేదీన తొక్కిసలాట చోటుచేసుకొంది. ఒక ఫుట్ బ్రిడ్జ్ కూలిపోవడమే దీనికి కారణం. ఈ ఘటనలో 42 మంది మరణించారు.



## ప్రయాగ్‌రాజ్ ప్రమాదం చాలా బాధాకరం

"ప్రయాగ్‌రాజ్ ప్రమాదం చాలా బాధాకరం. ఈ ఘటనలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన భక్తులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. దీంతో పాటు గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. బాధితులకు సాధ్యమైనంత సహాయం అందించడంలో స్థానిక ప్రభుత్వ యంత్రాంగం నిమగ్నమై ఉంది. ఈ విషయంలో నేను ముఖ్యమంత్రి యోగి జీతో మాట్లాడాను, రాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదిస్తున్నాను."

*- ప్రధాని మోదీ*

# కుంభమేళా చరిత్రలో మహా విషాదం

## అర్ధరాత్రి తొక్కిసలాట 30 మంది మృతి.. మరో 60 మందికి గాయాలు

### మృతుల్లో 25 మంది గుర్తింపు.. బారికేడ్లు విరగడంతో ప్రమాదం

### ఘటనపై జ్యుడిషియల్ విచారణకు ఆదేశం

### పరిస్థితిని ఎప్పికప్పుడు సమీక్షిస్తున్న సీఎం యోగీ ఆదిత్యనాథ్

**మహా, ప్రయాగ్‌రాజ్:** మౌని అమావాస్య సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభ్‌నగర్ త్రివేణి సంగమం వద్ద మహా కుంభమేళాలో బుధవారం తెల్లవారు జామున తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో 30 మంది మరణించారు. మరో 60 మంది గాయపడ్డారు. క్షతగాత్రులందరినీ వేర్వేరు ఆస్పత్రులలో చేర్పించి అధికారులు చికిత్స అందిస్తు న్నారు. తొక్కిసలాట ఘటనపై ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం అధికారిక ప్రకటన చేసింది. ఈ దుర్ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. మరో 60 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతు న్నారని తెలిపారు. చనిపోయిన వారిలో 25 మందిని మాత్రమే ఇప్పటి వరకు గుర్తించినట్లు పేర్కొన్నారు. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి 2 గంటల మధ్యలో ఈ తొక్కిసలాట ఘటన చోటు చేసున్నట్లు మహా కుంభ్ డీఐజీ వైభవ్ కృష్ణ బుధవారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మౌని అమావాస్య వేళ.. బుధవారం అర్ధరాత్రి ఒంటిగంటకు గంగా, యమునా, సరస్వతి నదులు కలిసే త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు చేసేందుకు లక్షలాది మంది భక్తులు ఒక్కసారిగా తరలిరావడంతో తొక్కిసలాట ఘటన చోటు చేసుకుంది.

తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తం కంటే ముందే పుణ్య స్నానాలు చేయాలని భారీగా భక్తులు అఖారా మార్గ్ వద్ద గుమిగూడారని డీఐజీ వెల్లడించారు. భక్తులు ఒకరిని మరొకరు తోసుకోవడంతో బారి కేడ్లు విరిగిపోయినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే బ్రహ్మ ముహూర్తం వేళ పుణ్యస్నానాలు చేయడానికి వేచి ఉన్న భక్తులపైకి.. ఈ భక్తుల గుంపు పరుగులు తీయడంతో తొక్కిసలాట చోటు చేసుకున్నట్లు వివరిం చారు. అయితే సుమారు 90 మందిని అంబులెన్స్‌ల ద్వారా దగ్గర్లోని ఆస్పత్రికి తరలించగా.. దురదృష్టవ శాత్తు అందులో 30 మంది భక్తులు మరణించినట్లు చెప్పారు. ఇక చనిపోయిన 30 మందిలో 25 మందిని గుర్తించామని.. మిగిలిన వారిని గుర్తించాల్సి ఉందని డీఐజీ వైభవ్ కృష్ణ తెలిపారు. వీరిలో కర్ణాటకకు చెందిన నలుగురు.. అస్సాం, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన ఒక్కో భక్తుడు ఉన్నట్లు వెల్లడించారు. స్థాని కంగా ఉన్న మెడికల్ కాలేజీలో 36 మంది గాయపడి నవారు చికిత్స పొందుతున్నారని చెప్పారు. ప్రస్తుతం తొక్కిసలాట ఘటన వద్ద పరిస్థితి సాధారణంగానే ఉన్నట్లు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యం కోసం మహా మండలేశ్వరులు, సాధువులు, అఖారాలకు చెందిన వారు కొంత ఆలస్యంగా పుణ్యస్నానాలు ఆచరించా రని పేర్కొన్నారు.

#### ఒక్కసారిగా పెరిగిన భక్తుల సంఖ్య

కుంభ మేళ ప్రారంభమైనప్పటి నుంచీ రోజూ కోటిన్నర నుంచి రెండు కోట్ల మంది పుణ్య స్నానాలు చేస్తుండగా, మౌనీ అమావాస్య ప్రాశస్త్యంతో భక్తులు బారీగా అమృత స్నానాల కోసం తరలి వచ్చారు. మంగళవారం సాయంత్రం నుంచి కుంభ మేళ జరుగుతున్న పరిసర ప్రాంతాలన్నీ స్నానాలను ఆచరించేందుకు వస్తున్న వారితో కిక్కిరిసిపోయాయి. భక్తుల తాకిడి అనుగుణంగా ఏర్పాట్లు చేసినప్పటికీ అమృత గడియలలోనే స్నానమాచరించాలన్న భక్తుల ఆతృత ఘోర ప్రమాదానికి కారణమైంది. మంగళవారం రాత్రి వరకు కుంభమేళ జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్న వారి సంఖ్య దాదాపు అయిదు కోట్లని పోలీసులు అంచనా వేశారు. ఒక్కసారిగా మూడింతల భక్తులు రావడంతో పోలీసులకూ కట్టడి చేయడం అసాధ్యంగా మారిన నేపథ్యంలో ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ప్రమాద ఘటన తెలుసుకున్న వెంటనే అప్రమత్తమైన యూపీ సీఎం యోగీ ఆదిత్యనాథ్ పరిస్థితి మరింత చేయి దాటి పోకుండా ఉండేందుకు ఘటనా స్థలంలో ఉన్న అధికారులతో మాట్లాడారు. అందుబాటులో ఉన్న అన్ని అంబులెన్స్ లను క్షతగాత్రులను తరలించేందుకు సన్నద్ధం చేశారు. అదనపు భద్రతా సిబ్బందిని పంపించి సాయంత్రంకల్లా సాధారణ పరిస్థితి నెలకొనెలా చర్యలు తీసుకున్నారు.

#### మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్ గ్రేషియా

ప్రమాదంలో గాయపడ్డ వారి కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్ గ్రేషియాను ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ప్రకటించారు. అదే విధంగా ముగ్గురు అధికారులతో జ్యుడీషియల్ కమిటీ వేసి విచారణకు ఆదేశించారు. గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందించేందుకు కావాల్సిన చర్యలను తీసుకుంటున్నట్లు ప్రకటించారు.



## బారికేడ్లు విరగడంతోనే ప్రమాదం

ఇదిలాఉండగా, బుధవారం మౌని అమావాస్య సందర్భంగా భారీ భక్తులు భారీ సంఖ్యలో ప్రయాగ్‌రాజ్ సెక్టార్ -2 వద్దకు వచ్చారు. అమృత స్నానాల కోసం సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే తోపులాట జరగగా బారికేడ్లు విరిగిపడ్డాయి. దీంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో పలువురు మృతి చెందారు. మౌని అమవాస్య నేపథ్యంలో పెద్ద ఎత్తున భక్తులు అక్కడికి వస్తారని అర్ధరాత్రి 12 గంటలకే డీఐజీ వైభవ్ కృష్ణ అక్కడ అందిరినీ అలర్ట్ చేశారు. ఆ సమయంలో భక్తులు త్వరగా స్నానాలు చేసి వెళ్లిపోవాలని సూచనలు చేశారు. అలాగే ఘాట్ల వద్ద రాత్రంతా నిద్రపోవద్దని కూడా హెచ్చరించారు. కానీ అప్పటికే భారీగా తరలివచ్చిన భక్తులు పోలీసుల మాటలు వినలేదు.



## చెత్త డబ్బాల వల్లే దుర్ఘటన

### కుంభమేళా తొక్కిసలాటపై ప్రత్యక్ష సాక్షులు

మహా కుంభమేళా తొక్కిసలాట ఘటనలో పదుల సంఖ్యలో భక్తులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. అనేకమంది గాయపడ్డారు. తొక్కిసలాటపై కొంతమంది ప్రత్యక్ష సాక్షులు మీడియాతో మాట్లాడారు. విపరీతమైన రద్దీ వల్ల ఎటు వెళ్లాలో తెలియక గందరగోళ పరిస్థితి నెలకొందని తెలిపారు. చీకట్లో కన్పించని చెత్త బుట్టలు కాళ్లకు తగలడం వల్ల చాలామంది కింద పడిపోయారని చెప్పారు. మౌని అమావాస్య కావడం వల్ల బుధవారం తెల్లవారుజాము న 2 గంటల సమయంలో పుణ్య స్నానాలు చేసేందుకు భక్తులు పెద్దసంఖ్యలో త్రివేణి సంగమానికి చేరుకున్నారు. తలపై పెద్దపెద్ద లగేజీలతో భక్తులు వచ్చారు. అయితే పుణ్యస్నానాలు చేయడానికి ఎటువైపు వెళ్లాలనే దానిపై చాలామందికి స్పష్టత లేదు. భక్తుల సౌకర్యార్థం త్రివేణీ సంగమం పరిసరాల్లో పెద్ద సంఖ్యలో ఇనుప చెత్త డబ్బాలను ఏర్పాటుచేశారు. చీకట్లో అవి భక్తులకు కనిపించలేదు. దీంతో ఆ చెత్తడబ్బాలు తగిలి చాలా మంది కిందపడ్డారు. దీనివల్లే తొక్కిసలాట జరిగిందని పలువురు ప్రత్యక్ష సాక్షులు ఒక సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్‌కు చెప్పారు.

#### చెత్త డబ్బా తగిలి కిందపడ్డానన్న ప్రత్యక్ష సాక్షి

చెత్త డబ్బా తగిలి తాను కూడా కింద పడ్డానని, ఏదో ఒక విధంగా అక్కడి నుంచి కుటుంబంతో సహా బయటకు వచ్చానని మరో ప్రత్యక్ష సాక్షి వివరించాడు. వేరే భక్తులను కాపాడే క్రమంలో స్వల్పంగా గాయాలు అయ్యాయని తెలిపాడు. రామ్‌సింగ్ అనే ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ 'తొక్కిసలాట జరిగిన ప్రాంతంలో జనం నిండిపోయారు. దీంతో ఎటు వెళ్లాలో ఎవరికీ అర్థం కాలేదు. ఈ క్రమంలో కొందరు నా కళ్ల ముందే స్పృహ తప్పి కిందపడ్డారు. చెత్త డబ్బాలు తగిలి ఇంకొందరు కిందపడ్డారు' అని చెప్పాడు.

#### భారీగా నిలిచిపోయిన వాహనాలు

ప్రయాగ్‌రాజ్‌లో భారీ జన సంద్రం కారణంగా మధ్యప్రదేశ్-ఉత్తర్‌ప్రదేశ్ సరిహద్దుల్లో వేలాది వాహనాలు నిలిచిపోయాయి. వేలాది మంది భక్తులు ఉన్న వాహనాలు మధ్యప్రదేశ్‌లోని రీవా జిల్లా చక్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సరిహద్దులో చిక్కుకున్నాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తెలిపారు. భక్తుల కోసం ఆహారం, వసతిని ఏర్పాటు చేసినట్టు ఎక్స్‌లో పోస్ట్ చేశారు



## ఆ కుటుంబాలను ఆదుకోవాలి

*- తెలంగాణ సీఎం రేవంత్*

*ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో తొక్కిసలాట ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆ కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం, ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం ఆదుకోవాలని, గాయపడినవారికి సరైన వైద్యం అందించాలని కోరారు.*



## తొక్కిసలాట దురదృష్టకరం

*– పవన్ కల్యాణ్*

*ప్రయాగ్ రాజ్ మహా కుంభమేళాలో చోటు చేసుకున్న తొక్కిసలాటలో 20 మంది భక్తులు దుర్మరణం పాలయ్యారని తెలిసి ఆవేదనకు లోనయ్యానని తెలిపారు ఏపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ . దురదృష్టకరమైన ఘటన ఇది. మౌని అమావాస్య సందర్భంగా పుణ్య స్నానాలు ఆచరించాలని కోట్ల మంది వచ్చిన క్రమంలో తొక్కిసలాట చోటు చేసుకోవడం బాధాకరం. మన తెలుగు రాష్ట్రాల నుంచి మహా కుంభమేళాకు వెళ్ళేవారు తగిన జాగ్రత్తలు పాటిస్తూ, ప్రభుత్వ అధికారుల సూచనలు అనుసరించాలని విజ్ఞప్తి చేస్తున్నానని ట్వీట్ చేశారు.*

## ప్రముఖుల స్నానం

మౌనీ అమావాస్య సందర్భంగా మహాకుంభమేళాకు భక్తులు పోటెత్తారు. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో అమృతస్నానాలు ఆచరించారు. చలిని సైతం లెక్కచేయకుండా తెల్లవారుజాము నుంచే భక్తులు భారీసంఖ్యలో ఘాట్లకు తరలివచ్చారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకు 4.24 కోట్ల మంది పుణ్యస్నానాలు చేసినట్లు యూపీ ప్రభుత్వం ప్రకటించింది. ఇక పలువురు ప్రముఖులు పుణ్యస్నానాలు చేశారు. దేశంలో నాలుగు మఠాలకు చెందిన శంకరాచార్యులు త్రివేణి సంగమానికి చేరుకుని అమృతస్నానం ఆచరించారు. బీజేపీ ఎంపీ హేమమాలిని, యోగాగురు బాబా రాందేవ్ త్రివేణిసంగమంలో అమృత స్నానాలు ఆచరించారు.

YOUNG

# యువ భాగ్యవంతులు

## తండ్రి వారసత్వం నిలబెడుతూ.. విజయ సోపానాలు
## యువ పారిశ్రామికవేత్తల్లో హర్ష పొంగులేటి స్ఫూర్తి
## సంచలనాల నీలిమ
## ఒక్క ఐడియాలో.. ఇరవైఏళ్ళకే కింగ్స్‌లా మారిన జెప్టో జోడీ

మన భాగ్యనగరం భాగ్యవంతుల అడ్డా. యువశక్తికి కొదువలేని గడ్డ. ఎన్నో అవకాశాలు.. ఎందరో కుబేరులు. భారతదేశంలో ఎక్కువమంది కోటీశ్వరులు నివసిస్తున్న నగరాల్లో హైదరాబాద్ మూడోస్థానంలో నిలబడింది. సౌత్ లో మన హైదరాబాదే టాప్. తోపు. యువ బిలియనీర్ల విషయానికొస్తే ఇండియాలోనే టాప్ టెన్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తనయుడు హర్ష పొంగులేటి ఉన్నారు. తండ్రి వారసత్వం కొంతమేర ఉపయోగపడ్డా, పారిశ్రామికవేత్తగా.. రియల్టర్ తన విజన్ తో అద్భుతాలు ఆవిష్కరిస్తున్నాడు. కొంతమంది యువకులు రాబోవు యుగం దూతలు, పావన నవజీవన బృందావన నిర్మాతలు అన్నారు శ్రీశ్రీ. అలాంటి ఆలోచనలు, పుణికిపుచ్చుకుని ఎంతోమంది విజయాలతో రాకెట్ లా దూసుకుపోయారు. వేలాదిమందికి ఆదరువయ్యారు.

HURUN INDIA



### నీలిమ ప్రసాద్ దివి: వ్యాపారంలో అగ్రగామి

నీలిమా ప్రసాద్ దివి తన వృత్తిపరమైన నైపుణ్యానికి మరియు వ్యక్తిగత విలాసానికి కూడా ప్రసిద్ధి చెందింది. హైదరాబాద్‌లోని అత్యంత ధనవంతుడు డాక్టర్ మురళి కె. దివి కుమార్తెగా, ఆమె తన కుటుంబ ఫార్మాస్యూటికల్ వ్యాపారమైన దివీస్ లాబొరేటరీస్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. వివిధ పరిశ్రమలలో ఆర్థిక వృద్ధి మరియు ఆవిష్కరణలను నడపడంలో మహిళలు పోషించే కీలక పాత్రను నీలిమ విజయాలు చాటిచెబుతున్నాయి. వ్యాపారానికి ఆమె చేసిన సహకారానికి అదనంగా, నీలిమ ఇటీవల 80 కోట్ల రూపాయలకు రెండు విలాసవంతమైన ఆస్తులను కొనుగోలు చేసినప్పుడు హాట్ టాపిక్ గా నిలిచింది. ఫోర్బ్స్ ప్రకారం, దివీస్ లాబొరేటరీస్ వార్షిక ఆదాయం రూ. 8,049 కోట్లు. 90%గా ఉంది. ఇది ఎగుమతుల నుండి వస్తుంది. దివీస్ లేబొరేటరీస్ మురళి దివి సంపద రూ.76,100 కోట్లు. తెలంగాణలో అత్యంత ధనవంతుడు ఆయనే. అయితే హైదరాబాద్ ఆధారిత కంపెనీలో హోల్‌టైమ్ డైరెక్టర్ కమర్షియల్‌గా, నీలిమా దివి మెటీరియల్ సోర్సింగ్ మరియు ప్రొక్యూర్‌మెంట్, కార్పొరేట్ ఫైనాన్స్ మరియు ఇన్వెస్టర్ రిలేషన్స్ యొక్క అన్ని అంశాలను ఆమె చూసుకుంటోంది . ఆమె తండ్రి, సోదరుడిలాగే నీలిమ దివికి బలమైన విద్యా నేపథ్యం ఉంది. ఆమె భారతదేశంలోని గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ నుండి ఇంటర్నేషనల్ బిజినెస్‌లో మాస్టర్స్ డిగ్రీని మరియు యుకెలోని గ్లాస్గో యూనివర్సిటీ నుండి ఇంటర్నేషనల్ ఫైనాన్స్‌లో మాస్టర్స్ డిగ్రీని పొందారు. హైదరాబాద్‌లో నీలిమ దివికి చెందిన ఖరీదైన ఆస్తులు ఉన్నాయి.



### తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన అయిదుగురు ఔత్సాహిక వ్యాపారవేత్తలు పిన్న వయసు లోనే మంచి విజయాలు నమోదు చేసి హురున్ జాబితాలో స్థానం సంపాదించారు. హైదరాబాద్ నుంచి నీలకంఠ భాను ప్రకాష్ (24 ఏళ్లు, భాంజు, ఎడ్యుటెక్ కంపెనీ)తో పాటు, శశాంక్ రెడ్డి గుజ్జుల (27 సంవత్సరాలు, నెక్స్ట్‌వేవ్, ఎడ్యుటెక్ కంపెనీ), రాకేష్ మున్ననూరు (29 ఏళ్లు, విజిల్‌డ్రైవ్, సాస్ కంపెనీ), అనురాగ్ మాలెంపాటి (30 ఏళ్లు, లీప్ ఇండియా ఫుడ్, లాజిస్టిక్స్ సేవల కంపెనీ) ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగి మండలానికి చెందిన అనుపమ్ పెదర్ల (29 ఏళ్లు, నెక్స్ట్‌వేవ్, ఎడ్‌టెక్ కంపెనీ)కు సైతం ఈ జాబితాలో స్థానం దక్కింది.

### పొంగులేటి హర్షా రెడ్డి యువ కెరటం

30 ఏళ్ల వయసులోనే అత్యంత సంపన్నుల జాబితాలో స్థానం సంపాధించుకుని.. తండ్రికి తగ్గ కొడుకు అనిపించుకుంటున్నాడు హర్ష పొంగులేటి . తండ్రి మొదలుపెట్టిన వ్యాపారాలను చూసుకోవటమే కాకుండా.. వాటిని లాభాల బాటలో నడిపించటంతో పాటు కొత్త సంస్థలను స్థాపించి.. చిన్న వయసులోనే అత్యంత సంపన్నుల జాబితాలో చేరటం విశేషం. హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2024 ప్రకారం.. కేవలం 30 సంవత్సరాల వయస్సులోనే.. తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు పొంగులేటి హర్షా రెడ్డి రూ.1,300 కోట్ల సంపదతో.. హైదరాబాద్‌కు చెందిన అత్యంత సంపన్న వ్యక్తుల్లో ఒకరిగా నిలవటం గమనార్హం. 30 ఏళ్ల వయసులోనే రూ. 1,300 కోట్ల నికర సంపదతో ఈ జాబితాలో 7వ స్థానంలో నిలిచారు. ప్రస్తుతం.. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు దాని అనుబంధ సంస్థలను హర్షా రెడ్డి చూసుకుంటున్నారు. అనేక వ్యాపారాల్లో తన దక్షత ప్రదర్శిస్తూ తెలంగాణలో వేగంగా దూసుకుపోయే యువ పారిశ్రామిక కెరటంగా తనదైన ముద్ర వేస్తున్నారు.

### ఇరవై ఏళ్ళకే జెప్టో

సాధారణంగా ఇరవై ఏళ్లకు మనం ఏం చేస్తూ ఉంటాం. డిగ్రీ లేదా ఇంజినీరింగ్ చివరికి వచ్చేసి.. తర్వాత ఏం చేయాలా అని ఆలోచిస్తూంటాం. క్యాంపస్ ఇంటర్వ్యూలో నాలుగైదు లక్షల ప్యాకేజీతో జాబ్ వస్తుందా లేదా అని కంగారు పడుతూంటాం. కానీ స్టార్టప్ కంపెనీ జెప్టో వ్యవస్థాపకులు మాత్రం ఆ వయసుకే బిలియనీర్లు అయిపోయారు. వారిద్దరి పేర్లు కైవల్య వోహ్రా, ఆదితి పాలిచా. జెప్టో ఈ పేరు నగరాల్లో ఉన్న వారందరికీ పరిచయమే. పది అంటే పది నిమిషాల్లో ఆర్డర్ ను డెలివరీ చేస్తారు. ఇది సాధ్యమా అని అనుకునేవారు ఉంటారు.. కానీ పది నిమిషాల కంటే ముందే డెలివరీ చేస్తారు. ఈ స్టార్టప్ ను ప్రారంభించినప్పుడు కైవల్య, అదితిల వయసు ఇరవై కంటే తక్కువే. స్టాన్ ఫర్డ్ యూనివర్శిటీలో చదువుకోవాలని వీరిద్దరూ ముంబై నుంచి వెళ్లారు కానీ కరోనా కారణంగా తిరిగి వచ్చేయాల్సి వచ్చింది. ఖాళీగా ఉండటం ఎందుకని.. కరోనా లాక్ డౌన్ సమయంలో.. కిరాణాకార్ట్ అని యాప్ రెడీ చేసి.. స్టార్టప్ ప్రారంభించారు. మొదట నలభై ఐదు నిమిషాల్లో కిరాణా సామాన్లను డెలివరీ చేయడం ప్రారంభించారు. అయితే వీరిద్దరికీ లాజిక్ అర్థమయ్యే సరికి కిరాణాకార్ట్ వెనుకబడిపోయింది. దాంతో మూసివేయక తప్పలేదు. కానీ ఈ ఆన్ లైన్ కిరణా వస్తువుల డెలివరీలో అపారమైన అవకాశాలు ఉన్నాయని అప్పుడే గుర్తించారు. ఇతర పెద్ద బ్రాండ్లు ఉన్నప్పటికీ.. తమ తెలివితేటలతో అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలమని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా..కిరణాకార్ట్ యాప్ ని జెప్టో పేరుతో రీ బ్రాండ్ చేశారు. పెట్టుబడిదారులను ఆకర్షించారు. పది అంటే పది నిమిషాల్లో డెలివరీ పేరుతో తెరపైకి వచ్చారు. అది ఇన్ స్టంట్ హిట్ అయిపోయింది. ఇప్పుడీ కంపెనీ వాల్యూ ఎవరూ ఊహించని స్థాయికి చేరిపోయింది. కైవల్యతో పాటు అతిది బిలియనీర్ల జాబితాలో చేరిపోయారు. అంతా మూడేళ్లలో జరిగిపోయింది. ఇంతా చేసి కైలవ్య వోహ్రా వయసు ఇరవై ఒక్క ఏళ్లు మాత్రమే. అదితి పాలిచా వయసు ఇరవై రెండేళ్లు. మొదటి నుంచి వీరిద్దరూ స్నేహితులే. ముంబైలోనే పెరిగారు. ఇప్పుడు దేశంలో అత్యంత పిన్న వయస్కులైన బిలియనీర్లు. వీరు అచ్చంగా తమ ఆలోచనలు.. తెలివి తేటల మీద బిలియనీర్లుగా అయ్యారు. వారసత్వంతో వచ్చిన ఆస్తులతో కాదు. ఇక్కడే అసలు విజయం దాగి ఉందని అనుకోవచ్చు. వయసు చిన్నదే అయినా.. స్టడీస్ డిస్ కంటిన్యూ చేసినా.. ఆర్థికపరమైన సవాళ్లు ఎదురైనా వీరిద్దరూ ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. పది నిమిషాల్లో డెలివరీకి అవసరమైన పక్కా ఏర్పాట్లతో రంగంలోకి దిగారు. అనుకున్నది సాధించారు.





# ఏనుమాముల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రియాంక

## వైస్ చైర్మన్‌గా బండి జనార్దన్.. 18 మందితో పూర్తి స్థాయి కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

బండి జనార్దన్ తో పాటు మొత్తం 18 మందితో పూర్తి స్థాయి కమిటీనీ నియామిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా గాదరబోయిన రవి, దనేకుల రాంబాబు, చల్లా వాసుదేవ రెడ్డి, గొడుగు భిక్షపతి, బాధవత్ నరసింహ నాయక్, ఆకుల రుద్రప్రసాద్, బొడ్డు ప్రదీప్ కుమార్, కత్తి సంపత్, ఎండీ సబీరా. అచ్చ నాగరాజు, దుగ్యాల గోపాల్ రావు, గజ్జెల శ్యామ్ సుందర్ తో పాటు జిల్లా మార్కెటింగ్ అధికారి, ఖిలా వరంగల్ పీఏసీఎస్చైర్మన్, ఏడీఏ వరంగల్, గ్రేటర్ వరంగల్ మేయర్ ను నియమించారు. ఈ కమిటీ కాలపరిమితి రెండేళ్లు పాటు వుంటుంది.

**చైర్మన్ ప్రియాంకకు సన్మానం**

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ గా నియమితులైన ప్రియాంకతోపాటు ఆమె భర్త డాక్టర్ పులి అనిల్ కుమార్ ను నేషనల్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర, వరంగల్ జిల్లా నాయకులు బుదవారం కలిసి శాలువాతో సన్మానించి పూల బొకేను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ ఆర్బీఎస్కే రాష్ట్ర అధ్యక్షులు, పల్లె దవఖాన మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ వల్లబోజు మోహన్ రావు, డాక్టర్ గుండా రవీందర్, డాక్టర్ మైదం రాజు, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ నవీన్, డాక్టర్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

# సౌదీ ఆరేబియాలో రోడ్డు ప్రమాదం

## తొమ్మిది మంది భారతీయులు దుర్మరణం




**మహా:** జెడ్డా - సౌదీ ఆరేబియాలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సౌదీలోని జిజాన్‌లో జరిగిన ఈ దుర్ఘటనలో 9 మంది భారతీయ పౌరులు ప్రాణాలు కోల్పోయారు. జిజాన్ నుంచి పని ప్రదేశానికి 26మందితో వెళుతున్న బస్సు మధ్యలో ట్రైలర్ ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మొత్తం 15 మంది మరణించారు..వారిలో తొమ్మిది మంది ఇండియన్స్ ఉన్నట్లు సౌదీ ప్రభుత్వం ప్రకటించింది.. ఈ ప్రమాదంలో గాయపడిన 10 మందిని చికిత్స కోసం హాస్పిటల్ కు తరలించారు.. ఇది ఇలా ఉంటే భారతీయు మృతి చెందిన విషయాన్ని జెడ్డాలోని భారత ఎంబసీ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. స్థానిక అధికారులతో టచ్‌లో ఉన్నామని, మృతుల కుటుంబాలకు తాము అండగా ఉంటామని పేర్కొంది. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ విచారం వ్యక్తం చేసింది. కాగా, మృతులు వివరాలు వెల్లడించలేదు. ఇది ఇలా ఉంటే జెడ్డాలోని రాయబార కార్యాలయంతో తాను మాట్లాడానని, ప్రమాదం గురించి సమాచారం అడిగి తెలుసుకున్నట్లు విదేశాంగ మంత్రి జైశంకర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలిపారు. ఇండియన్ కాన్సులేట్ బాధిత కుటుంబాలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతోందని అన్నారు. బాధిత కుటుంబాలకు తమ పూర్తి సహకారం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# నాగోబా జాతర ఉత్సవాలు మొదలు

## భారీగా జాతరకు తరలివచ్చిన జనం



**ఆదిలాబాద్, మహా:** తెలంగాణలోని ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో నాగోబా దేవాలయం ఉంది. ఈ ఆలయంలో కొలువైన నాగేంద్రుడిని గిరిజనులు భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఈ క్రమంలోనే ఈ నాగోబా జాతరను పుష్యమాస అమావాస్యసందర్భంగా మంగళవారం రాత్రి 10. 30 నిమిషాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీల ఆరాధ్యదైవం కోసం గోదావరి నుంచి తీసుకొచ్చిన పవిత్ర గంగాజలంతో నాగేంద్రునికి మెస్రం వంశీయుల అభిషేకం, ప్రత్యేక మహా పూజలు చేశారు. మంగళవారం అర్ధరాత్రి మెస్రం వంశంలో కొత్తగా పెళ్లయిన వారు, ఇప్పటి వరకు నాగోబాను దర్శించుకుని మెస్రం కోడళ్లు తెల్లటి దుస్తులు ధరించి భేటింగ్ (పరిచయం)లో పాల్గొన్నారు. ముందుగా పరిచయం కు వచ్చిన కోడళ్లకు మెస్రం వంశం మహిళల సహకారంతో నాగోబా ఆలయం, సతి దేవత ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించి దేవతలను చూపించారు. అనంతరం ఆలయంలో వరసలో కూర్చుని మెస్రం వంశ పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వారు పూర్తిగా మెస్రం వంశంలో చేరినట్లుగా భావిస్తారు. ఇలా రెండు రోజుల పాటు ఆయా దేవతలకు మెస్రం వంశీయులు పూజలు చేయనున్నారు. కాగా ఈ మహా పూజ, ఇతర కార్యక్రమాల అనంతరం నాగోబా జాతర ఉత్సవాలు మొదలైనట్లు ఆదివాసీలు తెలిపారు. భక్తులకు స్వామివారి దర్శనం కూడా ప్రారంభమైంది.



## సౌత్ సూడాన్‌లో

# కుప్పకూలిన విమానం

## 20 మంది దుర్మరణం

**మహా:** సౌత్ సూడాన్‌లో నేడు జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 20మంది ప్రయాణికులు మరణించారు. యూనిటీ రాష్ట్రంలో గ్రేటర్ పయనీర్ ఆపరేటింగ్ కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. విధుల్లో భాగంగా స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు ఉద్యోగుల్ని తీసుకుని రాజధాని జుబాకు బయలుదేరింది. అయితే, రన్‌వే నుండి 500 మీటర్ల దూరంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమానం కూలిపోయింది. ప్రమాదంతో చమురు క్షేత్రాల సమీపంలో విమాన శకలాలు తలక్రిందులుగా పడిపోయాయి. చుట్టూ చెల్లాచెదురుగా ఉన్న విమాన శిధిలాలు ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# ఏఐతో ఇందిరమ్మ ఇండ్ల పథకం

## మంజూరైన ఇండ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి .. ఇందిరమ్మ ఇండ్ల సమీక్షలో మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, మహా :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎలాంటి అక్రమాలకు, అవినీతికి తావులేకుండా లబ్దిదారులకు మేలు చేకూరేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకోవాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లపై సచివాలయంలో బుధవారం అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లబ్దిదారుల ఎంపిక నుండి ఇండ్ల నిర్మాణం పూర్తయ్యే వరకూ కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఎఐ) వాడుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక చేపట్టేందుకు ఇప్పటికే ప్రత్యేక యాప్‌ను రూపొందించి సర్వే నిర్వహించడం జరిగిందని ఇండ్ల నిర్మాణం, చెల్లింపులలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా రాష్ట్రంలో ఎక్కడినుంచైనా రోజువారీగా ఇండ్ల నిర్మాణ పురోగతిని పర్యవేక్షించేలా ఏఐని ఉపయోగించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. నిజమైన నిరుపేదలను గుర్తించేందుకు అత్యాధునిక సాంకేతిక విధానాలను అమలు చేస్తున్నామన్నారు. మొబైల్ యాప్ ద్వారా నిర్వహించిన సర్వే వివరాలను క్లౌడ్ ఆధారిత కృత్రిమ మేధస్సు (ఎఐ) టెక్నాలజీతో సరిపోలుస్తూ అనర్హులను గుర్తించి అర్హులను ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఇండ్ల నిర్మాణానికి సంబంధించి నాలుగు దశల్లో చెల్లింపులు చేస్తామని, ఈ చెల్లింపుల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా ఎప్పటికప్పుడు చెల్లించేలా ఏఐ టెక్నాలజిని వాడుకోవాలని నిర్ణయించినట్టు వెల్లడించారు.

రాజకీయ ప్రమేయానికి తావు లేకుండా, ఇతర ప్రభావిత విభాగాల జోక్యం లేకుండా లబ్దిదారుల ఎంపిక జరిగేలా ఈ విధానాలు సహకరిస్తాయని, అనర్హులు ఎవరైనా ఉంటే పూర్తిగా గుర్తించే అవకాశాలు ఈ నూతన సాంకేతిక విధానం వలన సాధ్యపడుతుందన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన 4 ప్రతిష్టాత్మక పథకాలలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ఒకటి. దీనిలో తొలి విడతగా నివాస స్థలం కలిగిన 72 వేల మంది లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందజేయడం జరిగిందని, ఈ ఇండ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తొలివిడత ఇండ్ల మంజూరులో అత్యంత నిరుపేదలు, వికలాంగులు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లకు ప్రాధాన్యత ఇస్తునట్టు తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ సెక్రెటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# అయితే జూబ్లిహిల్స్.. లేకుంటే సీసీసీ

**హైదరాబాద్, మహా:** ప్రజా పాలన అంటివి.. సీఎం క్యాంపు ఆఫీసులో ప్రజా దర్బార్ అంటివి.. ప్రతి రోజు ప్రజలు కలుస్తా అంటివి.. కానీ ఏడాది కాలంగా ప్రజలకు ముఖం చేటేస్తివి అని రేవంత్ రెడ్డిని బిఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శించారు. అయితే జూబ్లీ హిల్స్ ప్యాలెస్ నుంచి, లేదంటే కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కాంగ్రెస్ మార్కు ప్రజా పాలన కొనసాగుతుందని విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ ఖాతాలో ట్విట్ చేశారు... సీఎం, మంత్రుల పేషీలు, అన్ని శాఖలు, విభాగాలు ఒకే దగ్గర ఉండేలా, సువిశాలమైన అంబేద్కర్ సచివాలయం ఉండగా, దాన్ని కాదని మంత్రులు, అధికారులను నీ జూబ్లీహిల్స్ ప్యాలెస్ కు, కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు పదే పదే పరుగులు పెట్టిస్తున్నవు ఎందుకు అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి అధికార నివాసం మీ దర్పానికి సరిపోదని, జూబ్లీ హిల్స్ ప్యాలెస్‌లో ఉంటున్నావని సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు విమర్శించారు. మంత్రులు, అధికారులను ప్యాలెస్ కు పిలిపించుకొని, అహంభావం ప్రదర్శిస్తున్నవని మండిపడ్డారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అంటే అని ప్రశ్నిం

# మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంట్లో కీలక సమావేశం

## జీహెచ్‌ఎంసీ అవిశ్వాసానికి విరుగుడు వ్యూహం

**హైదరాబాద్, మహా:** జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం గురువారం జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కీలక భేటీ మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో నిర్వహించారు. జీహెచ్ఎంసి కౌన్సిల్ మీటింగ్ లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ చేశారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం అంశాన్ని తీసుకొస్తే ఎలా ఎదుర్కోవాలన్న అంశం పై చర్చించారు. హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు,మేయర్ విజయలక్ష్మితో పాటు , పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ కుమార్ గౌడ్ ,ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ బలమూర్ వెంకట్ తో పాటు పలువురు ముఖ్యనేతలు ఈ భేటీకి హాజరైనట్లు సమాచారం. ఇటీవల కేటీఆర్ మాజీమంత్రి తలసాని నివాసంలో



మీటింగ్ ఏర్పాటుచేసి వ్యూహం రచించగా, గ్రేటర్ నేతలు ఇపుడు పక్కా వ్యూహరచన చేస్తున్నారు. గ్రేటర్‌లో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి 20మంది కార్పోరేటర్లు ఉన్నారు.

# పంచాయితీ ఎన్నికలపై ప్రభుత్వం తర్జన భర్జన

## రిజర్వేషన్లపై సందిగ్ధత.. డెడికేషన్ కమిషన్ రిపోర్టు కోసం వెయిటింగ్

**తేదీల నిర్ణయమే తరువాయి అంటున్న ఎన్నికల అధికారులు**

**గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలనకు ఏడాది**

**కేంద్రం నుంచి నిలిచిపోయిన నిధులు.. కుంటుపడ్డ గ్రామాభివృద్ధి**




**హైదరాబాద్, మహా :** పంచాయితీ ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం తర్జనభర్జనకు గురవుతోంది. డెడికేషన్ కమిషన్ రిపోర్ట్ వచ్చిన తర్వాత ఎన్నికల నిర్వహణకు వెళ్లాలని నిర్ణయించింది. ఫిబ్రవరి 2లోపు డెడికేషన్ కమిషన్ రిపోర్టు ఇవ్వనుంది. రిపోర్టు వచ్చిన తర్వాత మరోసారి అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు. మరోవైపు ఫిబ్రవరిలోనే పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తై ప్రత్యేక అధికారుల పాలన అమలులోకి వచ్చి ఏడాది కావస్తోంది. దీంతో కేంద్ర ప్రబుత్వ నుంచి స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు నిలిచి పోయి గ్రామాలలో అభివృద్ధి కుంటుపడింది. కేంద్రం నిబంధనల మేరకు ప్రజా ప్రతినిధుల పాలన ఉంటే తప్ప నిధులు వచ్చే అవకాశం లేకపోవడంతో ఎన్నికలు ఎంత వీలైతే అంత తొందరగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. వాస్తవానికి సీఎం రేవంత్ రెడ్డి బుధవారం నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ఒక నిర్ణయం తీసుకుంటారని అందరూ భావించారు. కానీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక జాప్యం కావడంతో తాత్కాలికంగా ఎన్నికల అంశంపై చర్చను వాయిదా వేశారు. కులగణనకు సంబంధించిన ముసాయిదా సిద్ధమైనప్పటికీ ఇంకా ఫైనల్ రిపోర్టును డెడికేషన్ కమిషన్ ఇవ్వలేదు. ఫిబ్రవరి 2 లోపు కేబినెట్ సబ్ కమిటీకి అందిస్తామని డెడికేషన్ కమిషన్ ప్రభుత్వానికి తెలిపింది. డెడికేషన్ కమిషన్ నివేదిక సమర్పించిన కుల గణన నివేదిక ప్రకారం రిజర్వేషన్లను ఖరారు చేసే అకాశాలున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ స్థానిక ంసస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పెంచడంతో పాటు కులాల వారిగా పోటీకి అఇవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చింది. గతంలో ఇచ్చిన హామీ మేరకు రిజర్వేషన్లను పెంచాల్సిందే అన్న డిమాండ్ బలంగా తెరపైకి రావడంతో రాష్ట్ర ప్రబుత్వం స్థానిక ఎన్నికల నిర్వహణపై ఆచీ తూచీ నిర్ణయం తీసుకోవాలి భావిస్తున్నట్లు స్పఎష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 2 తరువాత మరోసారి సమావేశమై పంచాయతీ ఎన్నికలపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుకు ఉన్న అవకాశాలను ప్రభుత్వం అన్వేషిస్తోంది. రిజర్వేషన్లపై పాత పద్ధతిలోనే వెళ్లాలా లేక న్యాయ స్థానాలలో పెంచుకునే అవకాశం పొందాలా అనే దానిపై సర్కార్ తర్జన భర్జనకు గురవుతోంది. న్యాయ నిపుణుల సలహా మేరకు ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే 15 రోజుల్లో ఎలక్షన్స్ నిర్వహిస్తామని ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను గ్రామాల వారిగా సిద్ధం చేసి ఫైనల్ లిస్టును కూడా ఖరారు చేసింది.

# ఫిబ్రవరి 10లోగా సమగ్ర పర్యాటక విధానం

## ఎకో టూరిజంపై ప్రత్యేక దృష్టి

- **అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటకులను ఆకర్షించాలి**
- **అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, మహా** : సమగ్ర పర్యాటక విధానాన్ని ఫిబ్రవరి 10వ తేదీలోగా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న పర్యాటక ప్రదేశాలు, అభయారణ్యాలు, ఆలయాల ప్రాతిపదిక చేసుకొని పాలసీని రూపొందించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర పర్యాటక విధానంపై ముఖ్యమంత్రి తన నివాసంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. దేశీయంగా వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న పర్యాటక పాలసీలతో పాటు అంతర్జాతీయంగా ప్రముఖమైన పాలసీలను అధ్యయనం చేసి తెలంగాణ పర్యాటక పాలసీ రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. తెలంగాణకు దేశీయ పర్యాటకులనే కాకుండా అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించాలన్నారు. పర్యాటక రంగంలో బహుళ జాతి కంపెనీలు (ఎంఎన్‌సీ) పెట్టుబడులను ఆకర్షించేలా పాలసీ ఉండాలని సీఎం తెలిపారు. ఎంఎన్‌సీలు పెట్టుబడులు పెట్టినప్పుడు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో వసతులు ఏర్పడతాయని.. అప్పుడు పర్యాటకుల ఆకర్షణ సులవవుతుందన్నారు. కవ్వాల్, అమ్రాబాద్ పులుల అభయారణ్యాలను సఫారీ టూరిజానికి అనువుగా తీర్చిదిద్దాలన్నారు. సమ్మక్కసారక్క, రామప్ప దేవాలయం, లక్నవరాలను సర్క్యూట్‌గా తీర్చిదిద్దాలని, నాగార్జున సాగర్, శ్రీశైలం బ్యాక్ వాటర్‌ల్లో కేరళ తరహాలో బోటు హౌస్‌ల ద్వారా పర్యాటకుల సంఖ్య పెరిగేలా చూడాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో బౌద్ధ పర్యాటక ప్రదేశాలను కలుపుతూ బౌద్ధ సర్క్యూట్ ఏర్పాటు చేయాలన్నారు. సమ్మక్కసారక్క జాతరకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులు సమీపంలోని పర్యాటక ప్రదేశాలను సందర్శించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. సింగపూర్ వంటి దేశాలు తక్కువ ప్రదేశంలో వైవిధ్యమైన ప్రణాళికలతో పెద్ద సంఖ్యలో పర్యాటకులను ఆకర్షించడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ గార్డెన్, సంజీవయ్య పార్క్, ఇందిరా పార్క్‌లను కలుపుతూ స్కైవాక్, సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. అనంతగిరితో పాటు ఇతర ప్రాంతాల్లోనూ వసతులు మెరుగుపర్చాలని సూచించారు. పరిశ్రమలు, ఇతర రంగాల నుంచి వచ్చే ఆదాయమే కాకుండా పర్యాటక రంగం నుంచి వచ్చే ఆదాయం పెరిగితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరో దశకు చేరుకుంటుందన్నారు. సమీక్షలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో పాక్ టెర్రరిస్టు

## చెన్నైలో అరెస్టు చేసిన ఎన్ఐఏ.. బిర్యానీ సెంటర్‌ను నిర్వహించిన జక్రియా

**వరంగల్, మహా :** వరంగల్ లో ఉగ్రవాదుల కదలికలు తీవ్ర కలకలం రేకెత్తిస్తోంది. నగరానికి చెందిన వ్యక్తికి పాకిస్తాన్ ఉగ్రవాదులతో లింకులు ఉన్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు గుప్పుమన్నాయి. ఉగ్రవాదుల కదలికల ప్రచారంతో వరంగల్‌లో తీవ్ర కలకలం రేగుతోంది. వరంగల్ జానిపీరీలకు చెందిన జక్రియాకు పాకిస్తాన్ టెర్రరిస్టులతో సంబంధాలు ఉన్నాయని నిఘావర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ మేరకు అతన్ని చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈనెల 25న శ్రీలంకకు వెళ్తుండగా.. జక్రియాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా, కొంతకాలంగా వరంగల్ శివనగర్ అండర్ బ్రిడ్జ్ వద్ద నిందితుడు జక్రియా బిర్యానీ సెంటర్ నడుపుతున్నట్లు తెలుస్తోంది. అతనికి కొన్నేళ్లుగా పాకిస్తాన్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ప్రశాంతంగా ఉండే రంగల్ లో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాది ఉండటం, గత కొన్నాళ్ళుగా ఎవరికీ అనుమానం రాకుండా బిర్యానీ సెంటర్ ను నిర్వహించాడని తేలడంతో ఒక్క సారిగా చర్చనీయాంశంగా మారింది.

పాకిస్తాన్ నుంచి 25 ఏళ్ళ క్రితం ఇండియాకు వచ్చిన జక్రియా 10సంవత్సరాలు గుంటూరులో నివసించాడు. ఆ తర్వాత వరంగల్ లోని జాన్ పాక్ ప్రాంతంలో మకాం పెట్టి బిర్యానీ సెంటర్ పేరుతో ఉంటున్నట్లు గుర్తించారు. పాకిస్తాన్ లోని ఖలీఫా సంస్థకు పని చేస్తున్న జక్రియా ఖలీఫా ఇండియా హెడ్ గా పని చేస్తున్నట్లు నిఘా సంస్థలు గుర్తించాయి. బిర్యానీ సెంటర్ ముసుగులోనే ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్తాన్ లో ఉగ్ర సంస్థలకు సహకరిస్తున్నట్లు నిఘా సంస్థలు భావిస్తున్నాయి. జక్రియాతో పాటు అతడి సోదరుడు, దక్రియా భార్య తదితరులు ప్రస్తుతం వరంగల్ లో ఉండటంతో వారిని పోలీసులు అగుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. గుంటూరు నుంచి బతుకు తెరువు కోసం వరంగల్ కు వచ్చినట్లు స్థానికులతో జక్రియా కుటుంబం చెప్పినట్లు సమాచారం. అయితే జక్రియాకు పాకిస్థాన్ లోని ఏయే ఉగ్ర సంస్థలతో సంబంధాలున్నాయి. దేశంలో ఎవరెవరితో సంబంధాలున్నాయి. దేశంలో జరిగిన ఉగ్ర దాడులు, కార్యకలాపాలతో ఉన్న సంబంధాలు ఏమిటన్న అంశాలపై స్థానిక పోలీసులు ఆరా తీస్తున్నారు.

# ప్రతీ ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

## ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అవగాహన కార్యక్రమం



### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ మహా :** ప్రజలందరూ రోడ్డు భద్రత నియమాలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం రోడ్డు భద్రత మాస ఉత్సవాల్లో భాగంగా, స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి శివాజీ చౌక్ మంచిర్యాల చౌరస్తావరకు వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ మిని స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. రవాణా శాఖ అధికారులు కలెక్టర్ కు పూల మొక్కతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలందరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించే విధంగా విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి నిర్మల్ ను రోడ్డు ప్రమాదాల రహిత జిల్లాగా మార్చాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 26 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాల నియంత్రణ చర్యలను చేపట్టడం ద్వారా 23 ప్రమాద రహిత ప్రదేశాలుగా మార్చినట్లు తెలిపారు. హెల్మెట్ లేని డ్రైవింగ్, సీట్ బెల్ట్ లేని ప్రయాణం, మైనర్ డ్రైవింగ్ వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. పోలీసు శాఖ సహకారంతో ఎప్పటికప్పుడు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు. భద్రత నిబంధనలు పాటించని వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వాహనదారుడు కి కచ్చితంగా వాహన బీమా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనుకోని పరిస్థితుల్లో ప్రమాదాలు జరిగితే, బాధిత కుటుంబాలకు బీమాతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహించి, వాహనదారులందరికీ బీమా, లైసెన్స్ కలిగి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లాలో 'గిఫ్ట్ ఎ హెల్మెట్' అనే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలు వేడుకలు, పండుగలలో బహుమతులు, మిఠాయిలకు బదులుగా సోదరులకు హెల్మెట్ లను బహుమతిగా ఇవ్వాలి అన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారికి కలెక్టర్, ఇతర అధికారులు కలిసి హెల్మెట్ లను అందజేశారు. జెండా ఊపి వాహనాల ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులచే రోడ్డు భద్రత పై అవగాహన కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పి జానకి షర్మిల, అదనపు ఎస్పీలు రాజేష్ మీనా, ఉపేంద్రారెడ్డి లు, ప్రాంతీయ రవాణా అధికారి దుర్గాప్రసాద్, గ్రంథాలయ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలి, ఆటో యునియన్ అధ్యక్షులు మల్లేష్, నిర్మల్ పట్టణ తహసిల్దార్ రాజు, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సహాయ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, ఎన్సీసీ విద్యార్థులు, డ్రైవర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## మేడారం జాతరలో విద్యుత్ పనులు సకాలంలో పూర్తి చేయాలి

### టీజీఎన్పీడీసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి

**ములుగు, మహా :** మేడారం మినీ జాతర సందర్భంగా జరుగుతున్న విద్యుత్ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని తెలంగాణ ఎన్పీడీసీఎల్ సీఎండి వరుణ్ రెడ్డి విద్యుత్ అధికారులను ఆదేశించారు. బుధవారం సీఎండీ వరుణ్ రెడ్డి మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్నారు. అనంతరం మేడారంలో జరుగుతున్న విద్యుత్ పనులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాతరలో సిబ్బంది అందుబాటులో ఉండాలని, విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కాగా జాతరలో విద్యుత్ సరఫరాకు అన్ని ఏర్పాటు చేశామని సీఎండీకి అధికారులు తెలియజేశారు. అదే విధంగా ములుగు జిల్లా కేంద్రంలో నూతనంగా ములుగు నుండి మల్లంపల్లి వరకు నిర్మిస్తున్న 33 కెవి లైన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ బీకాం సింగ్, భూపాలపల్లి ఎస్ ఈ మల్చూర్ నాయక్, ములుగు డి ఈ నాగేశ్వరరావు, డిఈ ఎంఆర్టి సదనందం, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో ప్రజా పాలన విజయోత్సవ సంబురాలు

- వాఘాపూర్ , పిప్పల్ దరి, పిప్పర్ వాడ, దోప్టాల గ్రామాలలో కార్యక్రమాలు
- ముఖ్య అతిధిగా హాజరైన ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి
- ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు, గ్రామస్తులు
- ప్రజా పాలన పై ప్రజలకు అవగాహన కల్పించిన కెఎస్ఆర్
- నాలుగు సంక్షేమ పథకాలపై వివరణ





**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ నియోజకవర్గంలో ప్రజా పాలన విజయోత్సవ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం మావల మండలం వాఘాపూర్ ,ఆదిలాబాద్ రూరల్ మండలం పిప్పల్ దరి,జైనథ్ మండలం పిప్పర్ వాడ,బేల మండలం దోప్టాల గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమాలకు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కాంగ్రెస్ శ్రేణులు గ్రామస్తులు డప్పు చప్పుళ్ల మధ్య టపాసులు కలుస్తూ, పూల వర్షం కురిపిస్తూ ,మహిళలు మంగళ హారతులతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. వాఘాపూర్ లో ఎడ్ల బండి నడిపి గ్రామస్తులను ఉత్సాహపరిచారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేసారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణాలో ప్రజా పాలన నడుస్తుందన్నారు. పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. చెప్పినట్టుగానే ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా ,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా , కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందన్నారు. లబ్దిదారులందరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రైతు భరోసా పథకాలు అమలు చేయడానికి ఇంచార్జ్ మంత్రి సీతక్కతో మాట్లాడన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 50 వేల ఓట్లు వేసి తనను ఆశీర్వదించారన్నారు. గెలిచినా, ఓడినా ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానన్నారు.గత పదేళ్ల కాలంలో బీఆర్ ఎస్ ప్రభుత్వం చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. వాళ్లు ఓర్వలేకనే ప్రభుత్వం పై తమ అక్కసు వెళ్ళగక్కుతున్నారన్నారు. ఇక ఆదిలాబాద్ నియోజకవర్గంలో ప్రజలు అనవసరంగా బీజేపీకి ఓటు వేసి పాయల్ శంకర్ ను గెలిపించామని బాధ పడుతున్నారని అన్నారు. పేరుకు ఆయన ఎమ్మెల్యే అయినా ప్రజల గుండెల్లో తానే ఉన్నానని ప్రజల్లో తనకే గుర్తింపు ఉందన్నారు. ఆయన అవినీతి బాగోతం ఆదిలాబాద్ ప్రజలకందరికీ తెలుసునన్నారు.తాను ఎమ్మెల్యే భూముల కబ్జాపై ప్రెస్ మీట్ పెట్టి బహిరంగ చర్చకు సవాల్ విసిరినా అక్కడినుండి స్పందన లేదన్నారు. తన సవాల్ స్వీకరించే దమ్ము తనకు లేదన్నారు. ఎందుకంటే భూములు కబ్జాలు చేసిన మాట వాస్తవమని తమ దగ్గర పూర్తి ఆధారాలు ఉన్నాయన్నసంగతి తనకు తెలుసునన్నారు.గత బిఆర్ఎస్ ,బీజేపీ ప్రభుత్వాలు ప్రజలను పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే ప్రజలు కోరుకున్న విధంగా పాలన అందిస్తుందన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేయాలన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి సీతక్క ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్,మావల మండల్ ఎంపీపీ దర్శనాల ఏవన్,గ్రామస్తులు అల్లూరి చంద్రశేఖర్ రెడ్డి,చిలుకూరి ప్రతాప్ రెడ్డి,మార్సకోల హనుమంత్,కుడ్మేత గంగారామ్,కుదురుపాక సురేష్, కాటిపెల్లి అశోక్,మార్సకోల సుభాష్,కళ్లెం లింగ రెడ్డి,బాలే గంగన్న,కొడప కేశవ్ రావు,మార్సకోల సుభాష్,మార్స్కోల గౌతమ్,అశోక్ నాయకులు ఎం.ఏ షకీల్,దాసరి ఆశన్న,బూర్ల శంకరయ్య, సుధాకర్ గౌడ్,డేరా కృష్ణ రెడ్డి,అల్చెట్టి నాగన్న,సాహెబ్రావు,రఫీక్ తదితరులు పాల్గొన్నారు.



## బెల్ట్ షాప్ లపై ఫిర్యాదులు

### స్పందించిన జిల్లా కలెక్టర్

**వరంగల్, మహా:** గ్రామసభల మొదటి రోజు నల్లబెల్లి మండలం రేలకుంట గ్రామంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శనలో భాగంగా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా బుధవారం నల్లబెల్లి మండలం రేలకుంట గ్రామంలో జరిగిన గ్రామసభ కు హాజరైన సందర్భంగా గ్రామ నివాసి పాఠశాలల పరిధికి 100 మీటర్ల మేరకు ఏ కిరాణా షాపులో ఉండకూడదనే నిబంధనల మేరకు గ్రామస్తుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేసి రెడ్ హ్యాండెడ్ గా లిక్కర్ బీర్ పట్టుకొని షాపును సీజ్ చేసి షాపు యజమాని అంగోతు శ్రీను 50 సంవత్సరాలు అరెస్టు చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలో వరంగల్ జిల్లా ఎక్సైజ్ అధికారి మురళీధర్, నర్సంపేట సిఐ నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ యొక్క షాపును సీజ్ చేయడం జరిగిందని ఎక్సైజ్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

# జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ట చర్యలు



### కలెక్టర్ డా సత్య శారద



**వరంగల్ జిల్లా, మహా:** జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా సత్య శారద అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణపై డిసిపి రవీందర్ తో కలసి సంబంధిత శాఖల అధికారులతో మత్తు పదార్థాల నియంత్రణ పై ఆయా శాఖల సమన్వయ సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు గురి కాకుండా చూడాలని అన్నారు. విద్యాసంస్థల సమీపంలో 100 మీటర్ల మేరకు ఎలాంటి కిరాణా షాపులు ఉండకూడదు అనే నిబంధనను పాటించాలని పోలీస్ అధికారులకు సూచించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల విక్రించుటకు అనుమానస్పద ప్రాంతాలలో నిఘా వేసి తరచూ పెట్రోలింగ్ చేయాలని డీసీపీ రవీందర్ తగు సూచనలు చేశారు . జిల్లాలో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కాలేజీలలో ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు గా విద్యార్థిని విద్యార్థినులను ఏర్పాటు చేసి వారిని తరచు కాలేజీ విద్యార్థుల ప్రవర్తన నియమాల్ని పసిగడుతూ ఏదైనా అనుమానం వచ్చినట్లయితే వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇప్పించే ఇలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి మాధవ రావును ఆదేశించారు. హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ లను ఆకస్మికంగా అన్ఎక్స్పెక్టెడ్ గా తనిఖీలు చేయాల్సిందిగా ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వసతి భవనం ప్రారంభానికి సిద్ధం చేయండి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- భవన నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్



**వరంగల్, మహా:** ప్రభుత్వ ఉద్యోగినుల వసతిగృహ భవనాన్ని త్వరగా పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్, డాక్టర్ సత్య శారద ఆదేశించారు.బుధవారం వరంగల్లోని దేశాయిపేట శివాలయం వద్ద తెలంగాణ రాష్ట్ర మహిళా కార్పొరేషన్ ఆధ్వర్యంలో 4 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ ఉద్యోగినుల గృహ భవన నిర్మాణ పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి భవనం నిర్మాణం దాదాపు గా పూర్తయినందున ఫినిషింగ్ పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి డి ఆర్ డి ఓ కౌసల్యా దేవి, జిల్లా సంక్షేమ అధికారి,మహిళ ప్రాంగణ మేనేజర్ జయశ్రీ, మెప్మా డీఎంసీ రేణుక సి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

### ఓఎస్డి గీతె మహేష్ బాబా సాహెబ్





**ములుగు, వెలుగు :** ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ములుగు జిల్లా ఓఎస్డి గీతే మహేష్ బాబా సాహెబ్ పిలుపునిచ్చారు. బుధవారం ములుగులోని డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ లో ములుగు పోలీస్ శాఖ, రోడ్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో 300 మంది వాహనాదరులకు రోడ్డు భద్రత గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ములుగు ఓఎస్డి గీతె మహేష్ బాబా సాహెబ్ హాజరై మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండ రోడ్ భద్రత నియమాలు పాటించాలని, వారిపై కుటుంబం ఆధారపడి ఉన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ములుగు జిల్లాలో జరిగిన రోడ్ ప్రమాదాలలో హెల్మాట్ లేకుండా బైక్ డ్రైవ్ చేయడం, రాంగ్ రూట్లో రావటం అదేవిధంగా త్రాగి వాహనాలు నడపటం మూలంగా జరిగినవే అని అన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుండి స్పెషల్ డ్రైవ్ చేసి రోడ్ భద్రత నియమాలను పాటించని వారి పట్ల చట్ట ప్రకారం కఠినంగా వ్యవహారిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు డిఎస్పి ఎన్.రవీందర్, ములుగు సీఐ వి.శంకర్, అర్ టివో శ్రీనివాస్, ఎస్సై వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

# సదల్ పూర్ జాతరకు హాజరైన కంది శ్రీనివాస రెడ్డి





**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి బేల మండలం సదల్ పూర్ లోని ప్రాచీన ఆలయమైన భైరందేవ్ మహా దేవ్ ఆలయాన్ని సందర్శించారు. గత కొద్ది రోజులుగా ఇక్కడి ఆలయంలో జంగీ జాతర జరుగుతోంది. నేడు జాతర ముగింపు కార్యక్రమానికి ఆయన స్థానిక కాంగ్రెస్ శ్రేణులతో కలిసి హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు , గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో భైరందేవ్ మహా దేవ్ లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంది శ్రీనివాస రెడ్డి ని ఆలయ కమిటీ వారు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందచేసారు.ఈ సందర్భంగా ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ భైరందేవ్ ,మహదేవ్ ఆలయ నిర్మాణం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రాందాస్ నాక్లే, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజయ్ గుండావర్, మాజీ మార్కెట్ చైర్మన్ వామన్ వాంఖడే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు



# మంజీరాలో భక్తుల పుణ్యస్నానాలు

**జనవరి, మహా :** మాఘ అమావాస్యను పురస్కరించుకొని జోగిపేట సమీపంలోని చిట్కుల చాముండేశ్వరి ఆలయం వద్ద భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ సమీపంలో ఉన్న మంజీరా నదిలో భక్తులు పుణ్యస్నానాలు చేశారు. ఈ ప్రాంతంలో పవిత్ర ఆలయంగా భావించే చాముండేశ్వరి ఆలయంలో అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రాంతంలోని మంజీరా తీరంలో స్నాన ఘట్టాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు, మరియు పార్కింగ్ లేక ఇబ్బందులు పడ్డారు ఎదుర్కొన్నారు. పుష్యమాసంలో అమావాస్యను మౌని (మాఘా ) అమావాస్యగా జరుపుకుంటారు. అమావాస్యను చాలా పవిత్రమైన పర్వదినంగా భావిస్తారు, నదుల్లో పవిత్రస్నానాలు ఆచరిస్తారు భక్తులు. స్నానం యొక్క పవిత్రత రెండు లేదా ఎక్కువ నదులు కలిసేచోట చేస్తే పెరుగుతుంది. నది నీరు అమావాస్య నాడు అమృతంగా మారుతుందని నమ్ముతారు భక్తులు.

## అంతరాయం లేని సరఫరా లక్ష్యంగా పనిచేయాలి

### టిజిఎన్పీడీసీఎల్ భూపాలపల్లి నోడల్ ఆఫీసర్ బీకాం సింగ్



**ములుగు, మహా :** అంతరాయం లేని సరఫరాయే లక్ష్యంగా విద్యుత్ అధికారులు పనిచేయాలని తెలంగాణ ఎన్పీడీసీఎల్ భూపాలపల్లి నోడల్ ఆఫీసర్ బీకాం సింగ్ సూచించారు. ములుగు డివిజన్ విద్యుత్ కార్యాలయంలో బుధవారం భూపాలపల్లి, ములుగు జిల్లా అధికారులతో సమీక్షలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ బీకాం సింగ్ మాట్లాడుతూ కార్యాచరణ, ప్రణాళికల మేరకు పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. భూపాలపల్లి సర్కిల్ పరిధిలో విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆస్పత్రులు, ఇతర అత్యవసర సర్వీసులకు ప్రత్యామ్నాయ సరఫరాకు ఇంటర్ లింకింగ్ వ్యవస్థను ప్రతిష్టపరచాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలను పరిష్కరించడానికి ఎమర్జెన్సీ టీం వాహనాలను ఉపయోగించాలని, వ్యవసాయ సర్వీసుల మంజూరు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో భూపాలపల్లి ఎస్ ఈ మల్చూర్ నాయక్, ములుగు డీఈ నాగేశ్వరరావు,డిఈ ఎంఆర్ టి సదనందం, ములుగు, భూపాలపల్లి విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

PURE ELECTRIC VEHICLE

# బీఈ ఎనర్జీతో ప్యూర్ ఈవీ

## హైదరాబాద్‌లో తొలి యూనిట్

**ముంబై :** హైదరాబాద్ కేంద్రస్థానంగా కార్యకలాపాలు అందిస్తున్న ప్యూర్ ఈవీ.. ఫ్రెంచ్‌నకు చెందిన బీఈ ఎనర్జీతో జట్టుకట్టింది. అడ్వాన్స్‌డ్ లిథియం-అయాన్ బ్యాటరీ టెక్నాలజీని అందుబాటులోకి తేవడానికి ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్యూర్ ఈవీ వర్గాలు వెల్లడించాయి. దీర్ఘకాలికంగా ఈవీ కార్ల యజమానులకు అయ్యే ఖర్చును తగ్గించడానికి, ముఖ్యంగా నూతన బ్యాటరీ కొనుగోలుకు అయ్యే ఖర్చును తగ్గించడానికి వీలు పడనున్నదని వెల్లడించింది. ప్యూర్ ఈవీతో కుదుర్చుకున్న ఒప్పందంతో బీఈ ఎనర్జీ దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టినట్లు అయింది. ఇరు సంస్థల భాగస్వామ్యంలో భాగంగా హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ ఐడీఏ వద్ద ఏర్పాటు చేస్తున్న యూనిట్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో అందుబాటులోకి రానున్నట్లు ప్యూర్ ఈవీ ఎండీ, ఫౌండర్ నిశాంత్ దొంగరి తెలిపారు.

# విపణిలోకి స్కోడా కైలాక్ ఎస్‌యూవీ

## ప్రారంభ ధర రూ.7.89 లక్షలు



**న్యూఢిల్లీ, జనవరి 27 :** ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా స్కోడా..కైలాక్ మాడల్‌ను దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో పోటీని మరింత తీవ్రతరం చేయాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ కారు ప్రారంభ ధర రూ.7.89 లక్షలుగా నిర్ణయించింది. 1.0 టీఎస్ఐ ఇంజిన్‌తో తయారైన ఈ కారు లీటర్ పెట్రోల్‌కు 19.68 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. క్లాసిక్, సిగ్నిచర్, సిగ్నిచర్+, ప్రిస్టేజ్ వంటి నాలుగు రకాల్లో లభించనున్న ఈ కారుకు 5 స్టార్ రేటింగ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, 25 బలమైన భద్రత ఫీచర్లు ఉన్నాయని స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పెట్రా జనెబా తెలిపారు. కేవలం 10.5 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 188 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఈ కారుపై మూడేండ్లు లేదా లక్ష కిలోమీటర్ల వ్యారెంటీ సదుపాయాన్ని కల్పిస్తున్నది.

# హాట్సన్ జహీరాబాద్ ప్లాంట్ విస్తరణ




**హైదరాబాద్ :** అరుణ్ ఐస్‌క్రీం పేరుతో ఐస్‌క్రీం ఉత్పత్తులను విక్రయిస్తున్న హ్యాట్సన్ ఆగ్రో ప్రొడక్ట్ లిమిటెడ్.. జహీరాబాద్ ప్లాంట్ సామర్థ్యాన్ని భారీగా పెంచుకున్నది. గతంలో రోజుకు లక్ష కిలోల ఐస్‌క్రీంలను ఉత్పత్తి అవుతున్న ఈ ప్లాంట్ సామర్థ్యాన్ని 1.27 లక్షల కిలోలకు పెంచుకున్నట్లు కంపెనీ చైర్మన్ ఆర్‌జీ చంద్రమోగన్ తెలిపారు. దీంతో ఈ యూనిట్ దేశంలో అతిపెద్ద ఐస్‌క్రీం యూనిట్ కావడం విశేషమన్నారు. దీంతో గ్రూపు టర్నోవర్ బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. అలాగే హైదరాబాద్‌లోని సూరారం వద్ద రోజుకు 2.8లక్షల లీటర్ల పాలను కలుపుకోని 20 ప్లాంట్లలో రోజుకు 32 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నదని చెప్పారు.

# తీరుమారని రూపాయి..


## మరో 26 పైసలు పతనమైన దేశీయ కరెన్సీ.. డాలర్‌తో పోల్చితే 86.57 వద్ద మారకం విలువ



**ముంబై, జనవరి 28 :** రూపాయి మారకం విలువ మళ్లీ క్షీణించింది. మంగళవారం ట్రేడింగ్‌లో డాలర్‌తో పోల్చితే మరో 26 పైసలు పడిపోయి 86.57 వద్ద ముగిసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల భయం.. అంతర్జాతీయ మార్కెట్‌ను ఆవరించడంతో కరెన్సీ మార్కెట్‌పై ఆ ప్రభావం స్పష్టంగా కనిపించింది. మరోవైపు చమురు దిగుమతిదారుల నుంచి వస్తున్న డిమాండ్‌తో బలపడుతున్న డాలర్‌కుతోడు, భారతీయ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు తరలిపోతుండటం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసిందని ఫారెక్స్ మార్కెట్ వర్గాలు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నాయి. ఈ ఒక్కరోజే ఎఫ్ఐఐలు రూ.4,920.69 కోట్ల పెట్టుబడుల్ని దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి వెనక్కి తీసుకున్నారు. సోమవారం కూడా రూపాయి మారకం విలువ 9 పైసలు దిగజారిన విషయం తెలిసిందే. ఇదే రోజు రూ.5,015. 46 కోట్ల ఎఫ్ఐఐ పెట్టుబడులు తరలిపోయాయి.

# వరుసగా రెండోరోజు లాభాల్లో ముగిసిన మార్కెట్లు..

## 76 వేల ఎగువన ముగిసిన సెన్సెక్స్..!



భారత స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో సెషనల్‌లో లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 76వేలు, నిఫ్టీ 23వేల పాయింట్ల ఎగువ ముగిసింది. గ్లోబల్ మార్కెట్లలో మిశ్రమ ఫలితాల మధ్య లాభాల్లో మొదలైన మార్కెట్లు చివరి వరకు అదే జోరును కొనసాగించాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, జొమోటో షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ఫిబ్రవరి 1న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ సారి బడ్జెట్‌లో పన్ను మినహాయింపులు ప్రకటించనున్నారని భావిస్తున్నారు. అలాగే, ఆర్‌బీఐ సైతం వడ్డీ రేట్లను తగ్గించనున్నదనే అంచనాల నేపథ్యంలో మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. కిత్రం సెషన్‌తో పోలిస్తే 76,138.24 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 75,975.80 పాయింట్ల కనిష్ఠానికి చేరుకుంది. గరిష్ఠంగా 76,599.73 పాయింట్లను తాకింది. చివరకు 631.5 పాయింట్ల లాభంతో 76,532.96 వద్ద ముగిసింది. నిఫ్టీ 205.85 పాయింట్లు పెరిగి 23,163.10 వద్ద స్థిరపడింది. దాదాపు 2,874 షేర్లు పురోగమించగా.. మరో 937 షేర్లు పతనమయ్యాయి. మీడియా, క్యాపిటల్ గూడ్స్, ఐటీ, మెటల్, రియల్టీ రెండు నుంచి మూడుశాతం.. ఆటో, బ్యాంక్, ఫార్మా, ఆయిల్, గ్యాస్ 0.5 నుంచి 1.5 శాతం మధ్య లాభపడ్డాయి. ఎఫ్ఎంసీజీ సూచీ 0.5 శాతం పతనమైంది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.5 శాతం, స్మాల్ క్యాప్ సూచీలు 3.2 శాతం పెరిగాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, విప్రో, టాటా మోటార్స్, ఎస్‌బీఐ లైఫ్ అత్యధికంగా లాభపడగా.. ఏషియన్ పెయింట్స్, మారుతీ సుజుకీ, బీపీసీఎల్, బ్రిటానియా ఇండస్ట్రీస్, ఐటీసీ నష్టపోయాయి.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# మౌని అమావాస్య ఎఫెక్ట్..

## మహా కుంభమేళాకు ఒకేరోజు 6 కోట్లకుపైగా భక్తులు..!



ఉత్తరప్రదేశ్ లో జరుగుతున్న మహా కుంభమేళా కు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మౌని అమావాస్య ప్రభావంతో భక్తుల సంఖ్య ఇవాళ భారీగా పెరిగింది. బుధవారం ఒక్కరోజే సాయంత్రం నాలుగు గంటల వరకే ప్రయాగ్‌రాజ్ లోని త్రివేణి సంగమంలో అమృతస్నానాలు చేసిన భక్తుల సంఖ్య 6 కోట్లు దాటింది. దాంతో త్రివేణి సంగమంలోని ఘాట్‌లు అన్ని కిటకిటలాడుతున్నాయి. ఇవాళ మొత్తంగా కుంభమేళాకు వచ్చే భక్తుల సంఖ్య 8 కోట్లు దాటవచ్చునని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. అయితే మౌని అమావాస్య సందర్భంగా మహా కుంభమేళాకు భక్తుల తాకిడి భారీగా పెరగడంతో బుధవారం ఉదయం తీర్థరాజ్ సంగం తీరంలో తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో 14 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వారు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో భక్తులు రద్దీని తగ్గించేందుకు యూపీ సీఎం ఒక ప్రకటన చేశారు. మౌనీ అమావాస్య సందర్భంగా పుణ్య స్నానాలు చేసేందుకు భక్తులు త్రివేణి సంగమానికి తరలి రావాల్సిన అవసరం లేదని, వారివారి సమీప ఘాట్‌లలో స్నానాలు చేసినా సరిపోతుందని చెప్పారు. అయినా భక్తుల తాకిడి ఏ మాత్రం తగ్గలేదు. ప్రవాహంలా త్రివేణి సంగమానికి తరలి వస్తూనే ఉన్నారు. మౌని అమావాస్య నేపథ్యంలో పలువురు సాధువులు, యోగులు కూడా భారీ సంఖ్యలో అమృత స్నానాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సాధువులు, యోగులపై యూపీ ప్రభుత్వం హెలికాప్టర్‌లతో ఆకాశం నుంచి పూలు చల్లించింది. కాగా, బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకే మహా కుంభమేళాకు విచ్చేసిన భక్తుల సంఖ్య 5.71 కోట్లు దాటిందని, అదేవిధంగా జనవరి 28 వరకు మొత్తం 16 రోజుల్లో కుంభమేళాకు హాజరైన భక్తుల సంఖ్య 19.94 కోట్లు దాటిందని ఉత్తరప్రదేశ్ సమాచార శాఖ తెలిపింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఈ నెల 13 నుంచి మహా కుంభమేళా ప్రారంభమైంది. ఫిబ్రవరి 26న ఈ మహా కుంభమేళా ముగియనుంది. ఈ మహా కుంభమేళా ముగిసేనాటికి భక్తుల సంఖ్య 50 కోట్లు దాటే అవకాశం ఉందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

# సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదం..

## 9 మంది భారత పౌరులు దుర్మరణం




సౌదీ ఆరేబియాలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 9 మంది భారత పౌరులు దుర్మరణం పాలయ్యారు. సౌదీ అరేబియా పశ్చిమ ప్రాంతంలోని జిజాన్ నగరంలో ఈ ప్రమాదం జరిగింది. జెడ్డా లోని భారత రాయబార కార్యాలయం ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించింది. బాధిత కుటుంబాలకు తాము అండగా ఉంటామని, స్థానిక అధికారులతో బాధిత కుటుంబాలతో తాము ఘటనపై ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నది. ప్రమాదంపై బాధిత కుటుంబాలు సమాచారం తెలుసుకోవడం కోసం అక్కడి భారత రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ నెంబర్‌లను కూడా ఏర్పాటు చేసింది. సమాచారం కోసం 8002440003 (Toll free), 0122614093, 0126614276, 0556122301 (WhatsApp) నెంబర్లలో సంప్రదించాలని సూచించింది. కాగా ప్రమాదంపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పందించారు. సౌదీ రోడ్డు ప్రమాదంలో భారత పౌరులు ప్రాణాలు కోల్పోయిన వార్త తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. జెడ్డాలోని రాయబార కార్యాలయంతో తాను మాట్లాడానని, ప్రమాదం గురించి సమాచారం అడిగి తెలుసుకున్నానని విదేశాంగ మంత్రి జైశంకర్ చెప్పారు. భారత రాయబార కార్యాలయం బాధిత కుటుంబాలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతోందని అన్నారు. ఈ విషాద పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు తమ పూర్తి సహకారం ఉంటుందని ఆయన తన అధికారిక ఎక్స్ (X) ఖాతాలో పేర్కొన్నారు.

# తల్లి ప్రియుడ్ని.. దారుణంగా చంపిన ఆమె కుమారులు

**అహ్మదాబాద్:** తల్లి ప్రియుడ్ని ఆమె ఇద్దరు కుమారులు దారుణంగా హత్య చేశారు. తల్లితో అతడి సంబంధంపై ఆగ్రహించిన అన్నాదమ్ములు ఆ వ్యక్తిని కత్తితో పొడిచి పేగులు బయటకు లాగి చంపారు. ఇది చూసి అక్కడున్న వారు షాక్ అయ్యారు. గుజరాత్‌లోని గాంధీనగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఒక మహిళ భర్త 15 ఏళ్ల కిందట మరణించాడు. వితంతురాలైన తల్లితో 45 ఏళ్ల రతాన్జీ ఠాకూర్ సంబంధంపై ఆమె ఇద్దరు కుమారులైన 27 ఏళ్ల సంజయ్, 23 ఏళ్ల జయేష్ ఠాకూర్ కలతచెందారు. తమ తల్లికి దూరంగా ఉండాలని పలుమార్లు అతడ్ని హెచ్చరించారు. కాగా, తల్లితో రతాన్జీ ఠాకూర్ సంబంధం కొనసాగించడంపై ఆ అన్నాదమ్ములు ఆగ్రహంతో రగిలిపోయారు. చనిపోయిన తమ తండ్రికి అగౌరవం, కుటుంబానికి అవమానం కలిగించిన ఆ వ్యక్తి పట్ల వారు కక్షగట్టారు. ఈ నేపథ్యంలో జనవరి 26న గ్రామంలో ఇల్లు నిర్మిస్తున్న రతాన్జీ ఠాకూర్ వద్దకు సంజయ్, జయేష్ వెళ్లారు. వెంట తెచ్చిన కత్తి, రాడ్‌తో అతడిపై దాడి చేశారు. రతాన్జీ ఠాకూర్‌ను కత్తితో పొడిచి పొట్టలోని పేగులను బయటకు లాగి హత్య చేశారు. ఇది చూసి అక్కడున్న వారు షాక్ అయ్యారు. మరోవైపు అడ్డుకునేందుకు ప్రయత్నించిన హతుడి అనుచరుడిపై కూడా వారు దాడి చేశారు. కత్తిని చూపించి అక్కడున్న కార్మికులను భయపెట్టారు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు రతాన్జీ హత్యపై కేసు నమోదు చేశారు. నిందితుల మొబైల్ ఫోన్లను ట్రాక్ చేశారు. పరారీలో ఉన్న అన్నాదమ్ములైన సంజయ్, జయేష్ ఆచూకీని గుర్తించి వారిని అరెస్ట్ చేశారు. ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# ట్రిపుల్ తలాక్‌పై కేంద్రం స్పందన కోరిన సుప్రీంకోర్టు..!

## దాఖలైన కేసులు, చార్జిషీట్ల వివరాలు ఇవ్వాలని ఆదేశం..!



ట్రిపుల్ తలాక్ చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం విచారణ జరిపింది. ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణ చట్టాన్ని ఉల్లంఘించి.. తమ జీవిత భాగస్వామానికి ట్రిపుల్ తలాక్ ఇచ్చిన భర్తలపై దాఖలైన ఎఫ్ఐఆర్‌లు, చారిషీట్ల సంఖ్యపై సమాచారం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన 12 పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఆయా పిటిషన్లపై లిఖితపూర్వక వాదనలు దాఖలు చేయాలని కేంద్రంతో పాటు ఇతర పక్షాలను కోర్టు కోరింది. ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణ చట్టంలోని 2019లోని సెక్షన్లు 3, 4 కింద పెండింగ్‌లో ఉన్న మొత్తం ఎఫ్ఐఆర్, చారిషీట్ల సంఖ్యను కేంద్ర ప్రభుత్వం దాఖలు చేస్తుందని.. మిగతా పార్టీలు లిఖితపూర్వక వాదనలు సమర్పించాలని చెప్పింది. మార్చి 17న పిటిషన్లపై తుది విచారించనున్నట్లు బెంచ్ పేర్కొంది. 2019 జూలై 30న దేశంలో ట్రిపుల్ తలాక్‌పై కేంద్రం చట్టం తెచ్చింది. చట్టం ప్రకారం తలాక్ ఇవ్వడం చట్టవిరుద్ధం. ట్రిపుల్ తలాక్ ఇస్తే భర్తకు మూడేళ్ల వరకు శిక్ష విధిస్తారు. 2019 తీసుకువచ్చిన చట్టం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ కేరళకు చెందిన జమియాతుల్ ఉలేమా పిటిషన్ దాఖలు చేసింది. ట్రిపుల్ తలాక్ చల్లదని సుప్రీంకోర్టు తీర్పును సవాల్ చేశారు. సుప్రీంకోర్టు 2017 ఆగస్టు 22న ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధమంటూ చారిత్రాత్మక తీర్పును ఇచ్చిన విషయం తెలిసిందే. వివిధ మతాలకు చెందిన ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 3-2 తేడాతో తీర్పును ఇచ్చింది. ఆరు నెలల్లోగా ట్రిపుల్ తలాకప్‌పై చట్టం చేయాలని ప్రభుత్వానికి సూచించింది.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | గురువారం, హైదరాబాద్ | 30-01-2025
ANN తెలుగు

# ఈ సారి నో కాంప్రమైజ్..!



అందం, అభినయం, యాక్టింగ్, డ్యాన్స్‌తో ప్రేక్షకులను కట్టిపడేసే అతికొద్ది మంది టాలెంటెడ్ నటీమణుల్లో టాప్‌లో ఉంటుంది సాయిపల్లవి. ఈ అమ్మడు హీరోయిన్‌గా కనిపించబోతుందంటే చాలు ఆ సినిమా దాదాపు హిట్టయినట్టేనని ఫిక్సయిపోతారు మూవీ లవర్స్. ప్రస్తుతం నాగచైతన్య హీరోగా నటిస్తోన్న తండేల్‌లో ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తుంది సాయిపల్లవి. చందూమొండేటి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇందులో సాయిపల్లవి శ్రీకాకుళం అమ్మాయి సత్య పాత్రలో నటిస్తోంది. సాయిపల్లవి పాత్ర ప్రేక్షకులకు చిరస్థాయిగా గుర్తుండిపోతుందని ఇప్పటివరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, ట్రైలర్ చెబుతున్నాయి. ఒక్క హిట్ పడితే చాలు హీరోయిన్లు అమాంతం తమ రెమ్యునరేషన్లు పెంచడం చూస్తుంటాం. కానీ సాయిపల్లవి మాత్రం ఎన్ని హిట్స్ వచ్చినా రెమ్యునరేషన్ విషయంలో మాత్రం మార్కెట్‌కు తగ్గట్టుగా డిమాండ్ చేయలేదనే టాక్ కూడా ఉంది.అయితే ఎవరూ ఊహించని విధంగా తండేల్‌కు మాత్రం టాప్ రేంజ్ రెమ్యునరేషన్ తీసుకుంటుందన్న వార్త హాట్ టాపిక్‌గా మారింది. తాజా కథనాల ప్రకారం ఈ చిత్రానికి సాయిపల్లవి ఏకంగా రూ.5 కోట్లు తీసుకుంటుందట. ఇదే నిజమైతే సాయిపల్లవి కెరీర్‌లోనే అత్యధిక పారితోషికం అని చెప్పొచ్చు.2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోన్న ఈ మూవీని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.

# చెప్పకనే చెప్పింది..!

అగ్ర తారలు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న రిలేషన్‌లో ఉన్నట్లు గత కొంతకాలంగా వార్తలొస్తున్నాయి. అయితే తామిద్దరం మంచి మిత్రులం మాత్రమేనని ఈ జంట అనేక సందర్భాల్లో స్పష్టం చేశారు. అయినా వారిద్దరి రిలేషన్‌కు సంబంధించిన వార్తలు మాత్రం ఆగడం లేదు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రష్మిక మందన్న తన భాగస్వామి గురించి మాట్లాడిన మాటలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాను రిలేషన్‌షిప్‌లో ఉన్నానని కన్‌ఫర్మ్ చేసిన రష్మిక మందన్న.. భాగస్వామి పేరును మాత్రం చెప్పడానికి ఇష్టపడలేదు. ఇదే ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది రష్మిక మందన్న. ఈ ప్రపంచంలో తన ఇల్లు అత్యంత అనందకరమైన ప్రదేశమని చెప్పింది. 'సక్సెస్, ఫెయిల్యూర్స్ వస్తూ పోతుంటాయి. కానీ ఇల్లు ఇచ్చే ఆనందం శాశ్వతం. నేను ఎప్పటికీ ఓ బాధ్యత కలిగిన కుమార్తెను, సోదరిని, భాగస్వామిని కూడా. వీరి చుట్టూ కలబోసిన జీవితానికి నేను ఎంతో విలువిస్తాను' అని రష్మిక మందన్న చెప్పింది. ఈ ఇంటర్వ్యూలో తన భాగస్వామి గురించి రష్మిక మందన్న ప్రత్యేకంగా ప్రస్తావించడంతో తన ప్రేమ వ్యవహారం గురించి చెప్పకనే చెప్పిందని సోషల్‌మీడియాలో నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.





# రూల్స్ పాటించాల్సిందే!

అగ్ర దర్శకుడు రాజమౌళి తన సినిమాను ఓ యజ్ఞంలా భావిస్తారు.కొబ్బరికాయ కొట్టింది మొదలు గుమ్మడికాయ కొట్టే వరకు ప్రతీ విషయంలో అత్యంత శ్రద్ధతో వ్యవహరిస్తారు. ముఖ్యంగా సినిమాకు సంబంధించిన సమాచారంతో పాటు ఆర్టిస్టుల లుక్స్ తాలూకు ఫొటోలు బయటకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటారు. ప్రస్తుతం ఆయన మహేష్‌బాబుతో పాన్ వరల్డ్ అడ్వెంచర్ మూవీని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా విషయంలో ఎలాంటి లీక్‌లకు ఆస్కారం లేకుండా రాజమౌళి టీమ్ పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నదట.అందులో భాగంగా నటీనటులు, సాంకేతిక నిపుణులతో నాన్-డిస్‌క్లోజ్ అగ్రిమెంట్ చేసుకున్నారని పలు ఆంగ్ల పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. చిత్ర బృందం అనుమతి లేకుండా సినిమా తాలూకు ఎలాంటి సమాచారాన్ని, విశేషాలను బయటకు వెల్లడించొద్దని, ఒకవేళ ఎవరైనా అలా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని అగ్రిమెంట్‌లో పేర్కొన్నారట.

షూటింగ్ లొకేషన్‌లో ఫోన్లకు కూడా అనుమతి ఉండదని తెలిసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో తీర్చిదిద్దిన ప్రత్యేకమైన సెట్స్‌లో ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నది. ఈ సినిమాలో బాలీవుడ్ అగ్ర నటి ప్రియాంకచోప్రా కథానాయికగా నటిస్తున్నదని ప్రచారం జరుగుతున్నది. అయితే ఈ విషయాన్ని ఇప్పటివరకు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించలేదు.

# విజయ్ జననాయగన్ క్రేజ్

## ఓవర్సీస్ రైట్స్ ఎంత పలికాయో తెలిస్తే షాకే..!



కోలీవుడ్ స్టార్ యాక్టర్ దళపతి విజయ్ తమిళనాడులో ఓ వైపు వచ్చే అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని తన పొలిటికల్ పార్టీని బలోపేతం చేసే దిశగా ముందుకెళ్తూనే.. మరోవైపు అభిమానుల కోసం సినిమాను కూడా పూర్తి చేసే పనిలో ఉన్నాడు. విజయ్ ప్రస్తుతం దళపతి 69 సినిమాతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. జన నాయగన్ టైటిల్ తో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌కు కార్తీ (ఖాకీ) ఫేం హెచ్.వినోద్ దర్శకత్వం వహిస్తున్నాడు. రిపబ్లిక్ డే కానుకగా విడుదల చేసిన ఫస్ట్ లుక్‌తో పాటు టైటిల్‌కు మంచి స్పందన వస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి బయటకు వచ్చింది. ఈ మూవీ ఓవర్సీస్ రైట్స్‌కు రికార్డు స్థాయిలో ధర వచ్చిందన్న వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతుంది. తాజా కథనాల ప్రకారం జననాయగన్ ఓవర్సీస్ రైట్స్‌కు ఏకంగా రూ.75 కోట్లు పలికినట్టు ఇన్‌సైడ్ టాక్. విజయ్‌కు ఖండాంతరాల్లో ఎలాంటి క్రేజ్ ఉందో ఈ ఒక్క విషయంతో అర్థం చేసుకోవచ్చు. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తుండగా.. కన్నడ టాప్ బ్యానర్ కేవీఎన్ ప్రొడక్షన్ ఈ మూవీని నిర్మిస్తోంది. ప్రేమలు ఫేమ్ మమితా బైజు ఈ సినిమాలో కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమాను అక్టోబర్ 2025న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు.

# రాంగోపాల్ వర్మకు పోలీసుల నోటీసులు



ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫొటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఘటనలో టాలీవుడ్ డైరెక్టర్ రాంగోపాల్ వర్మపై ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. మరోవైపు సినిమా పోస్టర్లపై అనకాపల్లి, తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లలో వర్మ మీద కేసులు కూడా నమోదయ్యాయి. ఇప్పటికే ఈ వ్యవహారంలో రాంగోపాల్ వర్మకు ఏపీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. వర్మపై నమోదైన మూడు కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరైంది. తాజాగా ఆర్జీవీకి ప్రకాశం జిల్లా పోలీసులు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఫిబ్రవరి 7న విచారణకు రావాలని పోలీసులు నోటీసుల్లో పేర్కొన్నారు. దీనికి ఆర్జీవీ స్పందిస్తూ విచారణకు హాజరవుతానన్నారు. నోటీసులకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# క్రీడా వార్తలు | SPORTS NEWS

# టెస్టుల్లో స్టీవ్ స్మిత్ 10,000 పరుగులు

## 15వ బ్యాటర్‌గా రికార్డు

**గాలే, మహా:** అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లో ఆస్ట్రేలియా బ్యాటర్ స్టీవ్ స్మిత్ చరిత్ర సృష్టించాడు. టెస్టుల్లో పది వేల పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఆ ఘనతను అందుకున్న 15వ బ్యాటర్ అయ్యాడు. దీంతో ఎలైట్ క్రికెటర్ల జాబితాలో చేరాడతను. ఇండియాతో ఇటీవల జరిగిన టెస్టు సిరీస్ సమయంలో.. స్మిత్ పది వేల పరుగుల మైలురాయికి ఒక్క పరుగు దూరంలో నిలిచాడు. అయితే ఇవాళ శ్రీలంకతో ప్రారంభమైన టెస్టులో ఆ మైలురాయి దాటేశాడు.



## టీమిండియా మహిళా క్రికెట్ కెప్టెన్‌గా చూస్తామని ఆశిస్తున్నా..

### త్రిష గొంగిడికి కేటీఆర్ అభినందనలు

అండర్ 19 మహిళల ప్రపంచకప్‌లో సెంచరీ చేసిన తొలి మహిళగా తెలంగాణ అమ్మాయి త్రిష గొంగిడి రికార్డు సృష్టించడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. అండర్ 19 మహిళల ప్రపంచకప్‌లో అద్భుతమైన ఫీట్ సాధించిందని కొనియాడారు. దేశ గౌరవాన్ని పెంచడంతో పాటు.. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచ దేశాల్లో మార్మోగేలా చేశావని ప్రశంసించారు. ఐసీసీ అండర్ 19 టీ 20 మహిళల ప్రపంచకప్ లో సెంచరీ సాధించిన తొలి బ్యాట్స్‌ఉమెన్‌గా రికార్డ్ సాధించి.. ఎంతోమంది మహిళలకు, మహిళా క్రికెటర్లకు ఆదర్శంగా నిలిచిందని త్రిష గొంగిడిని కేటీఆర్ కొనియాడారు. ఆమెకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. మరికొన్నాళ్లలోనే టీమిండియా మహిళా క్రికెట్ లో అడుగు పెడతావని.. కెప్టెన్‌గా చూస్తామని ఆశిస్తున్నానని అన్నారు. గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష.. మలేషియాలో జరుగుతున్న అండర్ 19 మహిళల ప్రపంచకప్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. మంగళవారం స్కాట్లాండ్‌తో జరిగిన సూపర్ సిక్స్ పోరులో త్రిష (59 బంతుల్లో 110 నాటౌట్, 13 ఫోర్లు, 4 సిక్సర్లు) 53 బంతుల్లోనే శతకం బాది ఈ టోర్నీలో మొట్టమొదటి సెంచరీ చేసిన క్రికెటర్‌గా తన పేరును రికార్డుల పుస్తకాలలో సువర్ణాక్షరాలతో లిఖించుకుంది.



## భవిష్యత్‌లో త్రిష మరింత రాణించాలి

### ఎమ్మెల్సీ కవిత ఆకాంక్ష

**హైదరాబాద్ :** మహిళల అండర్ 19 టీ20 ప్రపంచకప్ టోర్నీలో రికార్డు సెంచరీతో చరిత్ర సృష్టించిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభినందనలు తెలిపారు. ప్రపంచ స్థాయిలో త్రిష సత్తా చాటడం మనందరికీ గర్వకారణం. భవిష్యత్తులో త్రిష మరింత రాణించాలని ఆకాంక్షిస్తున్నట్లు కవిత పేర్కొన్నారు. గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష.. మలేషియాలో జరుగుతున్న అండర్ 19 మహిళల ప్రపంచకప్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. మంగళవారం స్కాట్లాండ్‌తో జరిగిన సూపర్ సిక్స్ పోరులో త్రిష (59 బంతుల్లో 110 నాటౌట్, 13 ఫోర్లు, 4 సిక్సర్లు) 53 బంతుల్లోనే శతకం బాది ఈ టోర్నీలో మొట్ట మొదటి సెంచరీ చేసిన క్రికెటర్‌గా తన పేరును రికార్డుల పుస్తకాలలో సువర్ణాక్షరాలతో లిఖించుకుంది. త్రిషతో పాటు మరో ఓపెనర్ కమిలిని (42 బంతుల్లో 51, 9 ఫోర్లు) మెరవడంతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 208 పరుగుల భారీ స్కోరు చేసిన సంగతి తెలిసిందే.

## సీసీ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి తిలక్ వర్మ

### తొలిసారిగా టాప్5కి వరుణ్ చక్రవర్తి



ఇంగ్లాండ్‌తో రాజ్‌కోట్ వేదికగా జరిగిన మూడో టీ20లో ఐదు వికెట్లు పడగొట్టిన భారత జట్టు లెగ్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఐసీసీ టీ20 ఇంటర్నేషనల్ ర్యాకింగ్స్‌లో టాప్5కి చేరుకున్నాడు. ఏకంగా 25 స్థానాలు ఎగబాకి తొలిసారిగా ఐదో ప్లేస్‌కి చేరుకున్నాడు. అదే సమయంలో భారత స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ రెండో స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ ఓపెనర్ ఫిల్ సాల్ట్‌ని అధిగమించాడు. టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు.

**ఆ ఘనత సాధించిన మూడో భారత బౌలర్..**

ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి బంతితో అద్భుత ప్రదర్శన చేశాడు. అంతర్జాతీయ టీ20 కెరీర్‌లో రెండోసారి ఒక మ్యాచ్‌లో ఐదు వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా ఘనత సాధించాడు. దాంతో టీ20ల్లో భారత్ తరఫున ఒకటి కంటే ఎక్కువసార్లు ఐదు లేదంటే అంతకన్నా ఎక్కువ వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా నిలిచాడు. ఇంతకు ముందు భువనేశ్వర్ కుమార్, కుల్దీప్ యాదవ్ ఈ ఘనత సాధించారు. 2018లో దక్షిణాఫ్రికా, 2022లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన టీ20ల్లో భువనేశ్వర్ ఐదు వికెట్లు తీశాడు. 2018లో ఇంగ్లాండ్, 2023లో దక్షిణాఫ్రికాపై కుల్దీప్ యాదవ్ వికెట్లు పడగొట్టాడు. వరుణ్ గతేడాది దక్షిణాఫ్రికాలో 17 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు కూల్చాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com